ఆంధ్ర సంస్కృతి:

వ్యాసావళి





ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రచురణ

Blank Page

విషయ సూచిక

పుట

1. సంస్కృతి

ఎమ్. ఆర్. అప్పారావు (9-18)

అవతారిక	9
సంస్కృతి అంటే ఏమిటి?	10
ఆదర్శవాదులు	12
నిర్మమత్వం	12
సౌందర్యం	13
సౌందర్య తత్త్వశాస్త్రం	13
అలంకార శాస్త్రం	15
వేదాంతం-సాంఖ్యం	16
నవరసాలు	17
కళాసృష్టి	17

2. ఆంధ్రజాతి సంస్కృతీ చరిత్ర

ఎమ్. ఆర్. అప్పారావు (19-54)

భాష	19
చరిత్ర	20
వాస్తుకళ	23
జాతీయోద్యమం	25
ఆంధ్రోద్యమం	26
మహిళాలోకం	27
సాహిత్యం	28
సంగీతం	36
నృత్యం	38
నాటకం	40
సినిమా	44
విగ్రహశిల్పం	45
చిత్రలేఖనం	47

పుట

చేతిపనులు 49
జానపద వినోదాలు 49
విశ్వవిద్యాలయాలు 50
పరిశోధనలు 51
అకాడమీలు 52
పత్రికా రంగం 53
కళల పరమార్థం 54

3. ఆంధ్ర భాషా సాహిత్యాలు - ఆంధ్ర విశ్వవిద్యాలయం
ఆచార్య తూమాటి దొణప్ప (55–62)

సంస్కృతి

ఎమ్. ఆర్. అప్పారావు
వైస్-ఛాన్సలర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

అవతారిక :

ఆధునిక కళలో యువతరంవారి విప్లవాత్మక మనఃస్థితి కొంత గోచరిస్తుంది. నిరాశా నిస్పృహలు, ప్రాచీన కళపై, సంప్రదాయంపై కోపం – వీటివల్ల ~~వికృత~~ కళారూపాల సృష్టికి దారితీయటం జరుగుతుంది ; లేదా, నూత్న దృక్పథంవల్ల తమలో సాగుతున్న అంతర్యుద్ధానికి, ఉద్వేగానికి, అస్థిరతకు ప్రతీకలుగా ఉండే కల్పనలు చేయటం జరుగుతుంది. ఇది కూడా కళే అనిపించుకొంటుంది. ఎందుచేతనంటే, ఇందులో కూడా స్వేచ్ఛ, మానవత, ప్రకృతి విషయాలపై కళా సంబంధమైన ప్రతిక్రియ కనబడతాయి కాబట్టి. జాతీయం, ప్రాదేశికం అయిన పరిమితులను దాటి కళ క్రమంగా విశ్వజనీన మవుతున్నది. వాస్తవానికి ప్రాచ్య పాశ్చాత్య దేశాలు సన్నిహితా లవుతున్నాయి. ఈ దేశాల కళా సంస్కృతి రంగాల సమాగమంవల్ల ఒక నూత్న యుగావిర్భావం జరుగవచ్చు.

మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అనేక విధాలుగా పెనుకబడిన మన సంఘాన్ని ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఉన్నత స్థాయికి తీసికొనిపోవాలని ప్రభుత్వమూ, ప్రజలూ శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు. ఇది అంత సులభసాధ్యమైన విషయం కాదు ; చాలా శ్రమతో కూడుకొన్న కృషియిది. ఈ మహా ప్రయత్నంలో మనం సాంస్కృతిక విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. ఏమంటే సాంఘిక మహా సౌధం నిర్మించాలంటే సంస్కృతియే దానికి గట్టి పునాది కావాలి. బలమైన నైతిక కళా దృష్టి లేకపోతే, ప్రజాస్వామ్య సిద్ధాంతంపై మనం నిర్మించబోయే నవ సమాజంలో ఉత్తమ పౌరులను తయారు చెయ్యలేము.

ఆంధ్ర ప్రదేశ్‌లో సాహిత్య, సంగీత, నాటక, లలితకళా అకాడమీలు మూడూ ఏర్పడినాయి. సాంస్కృతిక వ్యవహారాలకు కూడా తగినంత ప్రోత్సాహ ప్రోద్బలాలు ఇవ్వాలనే సంకల్పంతో మన ప్రభుత్వం మన రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖను క్రొత్తగా ఏర్పాటు చేశారు.

అయితే మన ఆదర్శాలకు అనుగుణంగా మన విద్యాలయాలలో చదువుతున్న యువతీ యువకులకు తర్ఫీదు ఇస్తున్నామా? సౌందర్యానుభూతి, సత్యానుభూతి వారు పొందటానికి అనువైన క్రమశిక్షణ ఇస్తున్నామా? అని ప్రశ్నించుకొంటే, 'ఇవ్వటం లేదు' అని నిజం చెప్పవలసి వస్తుంది. అన్ని పాఠశాలల్లోను, కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను కూడా నైతిక విద్య, కళాత్మక విద్య ఉపేక్షింప బడుతున్నాయి.

ఈ సమస్యపై ప్రధానంగా మన దృష్టి ఇప్పుడు కేంద్రీకరింప బడాలనీ, మన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణమైన నవ విద్యా విధానం వెంటనే రూపొందింపబడాలనీ నేను చేసే ప్రతిపాదనతో సహృదయులందరూ ఏకీభవిస్తారని విశ్వసిస్తున్నాను.

సంస్కృతి అంటే ఏమిటి?

మానవజాతికి "సంస్కృతి" అనేది ఒక ఉన్నత లక్ష్యస్థానం. మానవ వ్యక్తిని జంతుకోటిలో ఒకటిగా నిర్వచించే పక్షంలో అతణ్ణి "సంస్కృతియోగ్యమైన జంతువు" అని పేర్కొనవలసి ఉంటుంది. కాని, సంస్కృతి యోగ్యమైన జంతువుగా నైనాసరే, జంతుకోటిలో ఒకడుగా పరిగణింప బడటం గౌరవహీనంగా భావిస్తాడు మానవుడు. దీనికి కారణం ఏ జంతువైనా సంస్కృతీమంతం కావటానికి జన్మతః అసమర్థమై ఉండటమే. జంతువుల బుద్ధి ప్రాకృతికమైనది; కాని మానవుని బుద్ధి విచక్షణా సహితంగా ఉంటుంది. బాధ్యత-బాధ్యతారాహిత్యం, స్వాతంత్ర్యం-దాస్యం, స్వార్థం-స్వార్థరాహిత్యం, మంచి-చెడు—వీటిమధ్య అవకాశం కల్పిస్తుంది విచక్షణా జ్ఞానం. జంతువులకు ఈ మంచి చెడ్డల భేదంతో ప్రసక్తే ఉండదు—కారణం వాటి బుద్ధి ఆలోచనా శీలంగా ఉండదు కాబట్టి. మానవుని చేష్టలలో వలె జంతువుల ప్రవర్తనలో పాప పుణ్యాల భేదమే ఉండదు. మానవులు తమ ప్రవర్తనకు తాము బాధ్యత వహించినట్లు జంతువులు వాటి ప్రవర్తనకు అవి బాధ్యత వహించవు.

మానవుని నరకం ఎంత అగాధాలలో ఉంటుందో, అతని స్వర్గం అంత మహోన్నత సీమలలో ఉంటుంది. మానవుడు నైతికంగా జంతువు కంటె పరమ అధోగతికి క్రుంగిపోనూ గలడు; దేవతల కంటె అత్యున్నత స్థితిని అందుకోనూ గలడు. మానవజాతి పురోగమించాలంటే భౌతిక శాస్త్రాలూ, నీతి శాస్త్రము కూడా మానవునిలోని భౌతిక లక్షణాలకు మానవతా లక్షణాలకు దోహదం చేయగలగాలి. ఇది జరగని పక్షంలో ప్రాణధారణదృష్ట్యా తా నే జంతుప్రపంచానికి చెందినవాడో ఆ జంతుప్రపంచంనుండి తన ప్రత్యేకతను నిరూపించుకొనే హక్కును మానవుడు కోల్పోతాడు.

ఇంతకూ ముఖ్యమైన ప్రశ్న "సంస్కృతి" అంటే ఏమిటి? అన్నది. సంస్కృతి, ఉభయాత్మకంగా ఉంటుంది. సౌజన్యం, దాక్షిణ్యం, నిస్స్వార్థం మొదలైనవి 'సంస్కృతి' అనిపించుకొంటే, దౌర్జన్యం, నిర్దాక్షిణ్యం, స్వార్థం అవేవి "సంస్కృతి" అనిపించుకొంటాయి. అయితే ప్రతి పనిని ఆయా పరిస్థితులను బట్టి విచారణ చెయ్యాలి. సంస్కృతీమంతుడైన వ్యక్తి తప్పక అట్లే చేస్తాడు. ఉదాహరణకు, దుష్టుడైన వ్యక్తి విషయంలో మనం సౌజన్యం చూపలేము గదా! అయితే ఒక్కొక్కప్పుడు శిక్షించి సాధించలేని ఫలితాలను దయాదాక్షిణ్యాలను చూపి సాధించడం జరుగవచ్చు. ఉన్న పరిస్థితులను ఆధారం చేసికొని, అహింసా సిద్ధాంతాన్ని జీవితానికి అన్వయించుకోవాలి. సంస్కృతీ రహితమై, దోపిడీ తత్త్వాన్ని ఆధారం చేసుకొన్న సామ్రాజ్య వాదపు బంధనాలలోంచి తప్పుకొని బయట పడటానికి గాంధీజీ మానవతాయుతమైన రాజకీయాలతో సంస్కృతి సాధనాలైన సత్యాహింసలను సమన్వయించారు. ఇట్లు ఆ ఫలితాన్ని సాధించడం ఒక్క గాంధీజీకే చెల్లింది. రాజకీయాలను మానవతా పూర్ణంగా చేయడం ఇంతకుముందు రాజనీతికి విరుద్ధంగా భావించబడింది. కాని గాంధీజీ ఈ భావాన్ని రూపుమాపడంవల్ల మానవజాతి అభ్యుదయరూపమే మారిపోయింది.

ప్రాక్తనదశ నుండి ఆధునిక దశ వరకు మానవుని అభివృద్ధి మానవునిలోని ఉదారత, కరుణ, దయ, స్వార్థ త్యాగం అనే గుణాలు క్రమంగా పరిణామం చెందిన విషయాన్ని సూచిస్తోంది. ఈ అభివృద్ధి జరగడానికి మానవునిపై మతానికి, తత్త్వ శాస్త్రానికి గల ప్రభావమే కారణం. అయితే, మతమూ, తత్త్వ శాస్త్రమూ తరచు దుర్వినియోగానికి గురికావడం అప్పుడూ, ఇప్పుడూ కూడా

ఉంటూనే ఉంది. అందువల్ల మానవుడు నైతికంగా పతనం కావడం జరుగుతూనే ఉంది. అయినప్పటికీ సర్వాంగీకృతమైన నైతిక దృష్టికే ఎప్పుడూ అంతిమ విజయం లభ్యమవుతుంది. మానవుణ్ణి వెనక్కి వెనక్కి అంధయుగాలలోకి తీసికొనిపోయే వేదాంతులు ఎల్లప్పుడూ ఉన్నారు; ఇకముందు కూడా ఉంటారు. నిన్న మొన్నటి ఉదాహరణలు ఫాసిజం, నాజిజం అనే వాటి విజృంభణ. ఇవి జాతి ఆధిక్యం, అసహిష్ణుత, క్రూరత్వం, స్వార్థం అనే వాటిపై ఆధారపడ్డాయి. కాని ఇవి మానవజాతిని ఉద్ధరించే నవనైతిక తత్త్వాలుగా రూపొందింపబడ్డాయి. అదృష్టవశాత్తు, ఈ జీవన్మరణ సమస్యలో చివరకు మానవతయే పశుత్వం మీద విజయాన్ని సాధించింది. ఈ ఫలితం ఇటు నుంచి, అటు తిరిగి ఉంటే మానవజాతి మనుగడ ఏమైపోయి ఉండేదో మనం ఊహించలేం.

ఆదర్శవాదులు :

ఆదర్శవాదులు ప్రపంచంలో ఏయే మూలలలో ఉన్నా, వారిలో ఆశ్చర్యకరమైన విధంగా పోలికలు కనిపిస్తాయి. మత ప్రవక్తలు, ఆదర్శవాదులు, తత్త్వవేత్తలు, రహస్యతావాదులు—వీ రందరు అంతర దృష్టితో సత్యసాధన చేసి, దురభిమానాదుల నుండి బయటపడి, నిర్మమతాయుతమైన గుణసంపత్తిని అలవర్చు కొన్నారు. విమర్శనాత్మక దృష్టిగల బుద్ధిమంతులు సైతం స్వార్థ రహితమూ. స్వేచ్ఛాయుతమూ అయిన తమ ఆత్మశక్తిని వినియో గించి, దేశకాలానుగుణమైన సంకుచిత దృక్పథం నుండి విముక్తి పొందారు. తమకోసం, తమ లాభాలకోసం, తాపత్రయపడకుండా పరమార్థంకోసమో, ప్రజాసమూహంకోసమో — అది భగవంతుడైనా, ప్రజా శ్రేయస్సు అయినా — తాపత్రయపడి, మనుకారం చూపే వారినే మానవజాతి ఆదర్శపురుషులుగా మన్నించింది.

నిర్మమత్వం :

నిర్మమత్వంలో దాతృత, ధైర్యం, ఔదార్యం, వివేకం, నిర్లిప్తత మొదలైన సుగుణాలు ఇమిడిఉన్నాయి. ఈ నిర్మమత్వాన్ని అన్ని మతాలవారు, పలువురు తత్త్వవేత్తలు బలపర్చడం జరిగింది. కొందరు తత్త్వవేత్తలు మాత్రం ఈ సుగుణాల్ని త్రోసిపుచ్చి క్రూరత్వం, హింస, భయం, అత్యాచారం మొదలైన వాటిని

ఆధారం చేసుకొన్న ఒక తాత్త్విక దృక్పథాన్ని ప్రచారం చేశారు. వారు సత్యాన్ని కూడ సాపేక్షంగానే పరిగణించి, ఏదో ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని, అసత్యాన్ని, అంటే, క్రమయుతమైన మిథ్యా ప్రచారాన్ని కూడ ఆకాశాని కెత్తి గౌరవిస్తారు. వీరు దేవుని స్థానంలో ఒక జాతినో., ఒక వర్గాన్నో, చివరకు ఒక నియంతనో నెలకొల్పి, ఇతర జాతుల శ్రేయస్సుకు భంగం కలిగిస్తారు. అయితే ఇప్పుడు, సత్ప్రయోజనాల్ని అసత్య మార్గాల ద్వారా సాధించగలమా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. కాని, సత్ప్రయోజనాలను సత్య మార్గాల ద్వారానే సాధించగలమని మనం విశ్వసిస్తామనడంలో నా కెలాంటి సందేహమూ లేదు. "సాధనాలు ఏవైనా ఫలితాలే ముఖ్యం" అనే నినాదం చాలా ప్రమాదకరమైంది. ఇది ఔద్ధత్యం, హింస, అసత్యం మొదలైన చెడుగుణాలకు దారితీస్తుంది.

సౌందర్యం :

మానవతతోపాటు సంస్కృతిలో ఇంకో ముఖ్యమైన అంశం ఉంది. అది ప్రకృతిలోను, భావనలోను, భావవ్యక్తీకరణలోను ఉన్న సౌందర్యాన్ని ఆస్వాదించగలగడం, మెచ్చుకోగలగడం. ధ్వని, ఆకృతి, వర్ణం, చలనం మొదలైనవి ప్రకృతి ప్రాథమిక ధర్మాలు - ఇవి ఆలోచనా శీలమూ సహజస్ఫురణాత్మకమూ అయిన మానవబుద్ధిచే అనుసంధానింపబడినప్పుడు బహుముఖ కళా ద్వారములలో వ్యక్తములై, పరమ సుందరములైన కళారూపము లను స్వీకరిస్తాయి. ఇవి సంస్కృతీమంతమైన మానవబుద్ధికి శాశ్వత వికాశాన్ని, అనుసంధాన నిమగ్నతను కల్పించుటకు దోహదం చేస్తాయి. ఈ విధంగా మానవతపైగాని, మతముపైగాని ఆధారపడిన నీతిశాస్త్ర, సౌందర్యతత్త్వాలు మానవ జాతి యొక్క వెలలేని భాగధేయాలు. తరచు అజ్ఞాన ప్రమాదానికి లోనుకాగల ఆలోచనాశీలమైన బుద్ధిని మించి మానవబుద్ధి వికసించవలెనంటే మతాన్నిగాని, మానవతనుగాని అవలంబించియున్న స్వార్థత్యాగం, సౌందర్యమగ్నత అనే వాటిని గాఢంగాను, విస్తారంగాను మానవ జాతి అలవర్చుకొనవలసి ఉంటుంది.

సౌందర్యతత్త్వశాస్త్రం :

ముఖ్యంగా లలిత కళల విషయమై అంటే సౌందర్యతత్త్వాన్ని గూర్చి మన మిప్పుడు ముచ్చటించుకొందాము. ఈ సౌందర్య

తత్త్వాన్ని గూర్చి అనేక సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ఆధునిక సౌందర్యతత్త్వ సిద్ధాంతంపై ప్రముఖ పాశ్చాత్య రచయిత బెనిడెట్టో క్రోస్చె "కళా, దాని వివిధ రూపాలు సహజ స్ఫురణ శక్తికి పర్యాయరూపమైన వ్యక్తీకరణము యొక్క అంశములే" అని ఆయన పేర్కొన్నాడు. సహజ స్ఫురణశక్తి బుద్ధిమత్తకు, నైతిక భావనకు భిన్నమైనప్పటికీ అది వీటిపై అనుభవం కోసం, కళా రూపమైన వ్యక్తీకరణ కోసం ఆధారపడి ఉంటుంది. దీనికి ఉదాహరణంగా కృష్ణ కర్ణామృతములోని క్రింది శ్లోకాన్ని గ్రహింపవచ్చు:

సాయంకాలే వనాన్తే కుసుమితసమయే సైకతే చంద్రికాయాం
త్రైలోక్యాకర్షణాంగం సురనరగణికా మోహనాపాంగమూర్తిం ।
సేవ్యం శృంగారభావై ర్నవరసభరితై ర్గోపకన్యాసహస్రై
ర్వన్దేఽహం రానకేళీరత మతిసుభగం వశ్య గోపాలకృష్ణమ్ ॥
(తృతీయాశ్వాసం, 104 శ్లో.)

ఈ శ్లోకాన్ని, అందలి నైతిక విషయం వల్ల కాక భావనలోని లేదా సహజ స్ఫురణశక్తిలోని గొప్పవనం వల్లనే మనం మెచ్చుకొంటాము.

"కళ కళకోసమే" అన్న వాదాన్ని కొందరు అంగీకరించరు. జాన్ డ్యూయీ జీవితంలోని అంశాల కంటె కళ భిన్నమైనది అనే వాదాన్ని అంగీకరించడు. ఒక గీతంలోని భావం యొక్క సంపూర్ణత్వానికి గీతంలోవున్న పదాలు ముఖ్యం. కేవల నాదం సంగీతాన్ని అనుభవించడానికి, తద్ద్వారా కలిగే అనుభూతిని పొందటానికి చాలదు. గానం జీవితంలోనిసుఖాన్ని, లేదా, దుఃఖాన్నిగూర్చి ఏదో ఒక భావాన్ని మనలో మేల్కొల్పుతుంది. అయితే ఇది ఎంతవరకు జరుగుతుంది? అన్నది మళ్ళీ భిన్నాభిప్రాయాలకు తావు ఇచ్చే సమస్య. నిత్యజీవిత సంఘటనలకే కళారూపం ఇచ్చినప్పుడు అవి సౌందర్యమయాలుగా పరిణమిస్తాయనీ, వాస్తవికాంశాలను బట్టి శాస్త్ర ప్రవచనాలు ధ్రువపడటమో పడకపోవటమో జరుగుతుందనీ, కళాసృష్టి వాస్తవికాంశాలనూ కళాత్మకమైన అమూల్య వస్తు జాలముగా మారుస్తుందనీ మరికొంద రంటారు. మాక్స్‌డొసాయిర్ అనే విమర్శకుడు సంప్రదాయంగా వస్తున్న "సౌందర్యతత్త్వ శాస్త్రం" (Aesthetics) అనే మాటకు బదులు "వైజ్ఞానిక కళాశాస్త్రం" (The General Science of Art) అని క్రొత్త పేరు పెట్టాడు. నైతిక సమస్యలను అనుసంధించే భాషాత్మక విభజన సిద్ధాంత ప్రాబల్యం

వల్ల కళకు సంబంధించిన అర్థాన్ని, సత్యాన్ని ఒక కొత్త దృక్పథంతో చూడటం ఫలితంగా ఈ మార్పు వచ్చింది. తత్త్వ శాస్త్రం, విజ్ఞానశాస్త్రం, మనస్తత్త్వశాస్త్రం, సాంఘికశాస్త్రం, మానవ శాస్త్రం, సంస్కృతి, చరిత్ర, విమర్శ, విద్యాపద్ధతి - వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని కళలను, వాటికి సంబంధించిన ఇతర అంగాలను గూర్చి చేసే అధ్యయనమంతా సౌందర్య తత్త్వశాస్త్రానికి సంబంధించిందే అని "అమెరికన్ సొసైటీ ఆఫ్ ఈస్థటిక్స్" వారు పేర్కొన్నారు. ప్రాచీన సంప్రదాయానికి విరుద్ధమైన "వైజ్ఞానిక సౌందర్యతత్త్వశాస్త్రం" అన్న మాటకు ఈ నిర్వచనం సన్నిహిత మైంది. ఈ నిర్వచనాన్ని పరిశీలించి చూస్తే, ఇందులో కాదన వలసింది ఏమీ లేదనిపిస్తుంది.

థామస్ మన్రో శాస్త్రీయదృక్పథంతో కళలను పరిశీలన చేసిన పండితుడు. ఆయన "శాస్త్రీయపంథాలో భావనకు, ప్రత్యుత్పన్న మతిత్వానికి ఎంతవరకు తావు ఉంటుందో చూపినాడు. ఈ పంథాలో—కళానిర్మాణంలో, కళాస్వాదనలో, కళావిమర్శలో ఏమి ఇమిడి ఉన్నదన్న విషయాన్ని అధికంగా చర్చించటం కంటె తాను అవగాహన చేసుకొన్నదానిని అర్థవంతమైన కళాత్మక వస్తువుగా కల్పించడంలో నేర్పు సంపాదించటం ముఖ్యం. ఇతర సాధనలకు, కళలకు ఉన్న సంబంధం చక్కగా అవగాహన చేసి కొనడంవల్ల విశ్వవిద్యాలయాల్లోను, కళాశాలల్లోను భిన్న భిన్న కళాత్మక రచనలు ఇతోధికంగా వెలువడటానికి అవకాశం కల్పించ బడింది. ఉన్నత పాఠశాలల్లోను, ప్రాథమిక పాఠశాలల్లోను కూడా కళాభివృద్ధికి ఎంతో దోహదం చెయ్యవలసిన అవసరం ఉంది."—(Colliers Encyclopaedia).

అలంకార శాస్త్రం :

భారతీయ సౌందర్య తత్త్వ శాస్త్రమునకు 'అలంకార శాస్త్రము' అని పేరు. భామహుడు, ఉద్భటుడు, రుద్రటుడు, దండి, వామనుడు అను కొందరు ప్రసిద్ధికెక్కిన అలంకారికులు. వీరందరూ ఆ శాస్త్రంలో ప్రాచీన సంప్రదాయమునకు చెందిన వారు. వీరి మతంలో కావ్యగౌరవం దోషము, గుణము, అలంకారము అనువాటినిబట్టి నిర్ణయింపబడుతుంది. వీటిలో అలంకారము సాహిత్యమునకు మాత్రము పరిమితం చెయ్యబడింది; పైగా అదే ముఖ్యంగా చెప్పబడింది. మిగిలిన గుణదోషము లన్నవి

తర్క వ్యాకరణాలకు సంబంధించి భావసౌష్ఠవమును, శబ్ద సాధుత్వమును చెప్పేవి. ఇక్కడ కవితావస్తువుకంటె శబ్దార్థములకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. గుణములన్నవి కవిత్వానికి ఉత్కర్ష కలిగించేవి; ఇంక దోషములన్నవి కవిత్వానికి అపకర్ష కలిగించేవి.

ప్రాచీన సంప్రదాయమునకు భిన్నమైనది 'నవీన సంప్రదాయం'. దీనికి ప్రవర్తకుడు ధ్వన్యాలోక రచయిత అయిన ఆనందవర్ధనుడు. ధ్వన్యాలోకాన్ని వ్యాఖ్యానించినవాడు అభినవ గుప్తుడు. ఈ సంప్రదాయంలో వాచ్య వ్యంగ్యాలను బట్టి కావ్యం విలువ నిర్ణయింపబడుతుంది. ఇందులో వ్యంగ్య వైభవం గల కావ్యానికే ఎక్కువ పరిగణన, ప్రాశస్త్యం వస్తాయి. గుణదోష వివేకం త్రోసిపుచ్చరానిదే; కాని వ్యంగ్య స్ఫురణ ఉన్నదా లేదా అన్నదే ప్రధానంగా పరిశీలింపదగ్గ విషయం అని వీరంటారు. ఈ వ్యంగ్యం—వస్తుధ్వని, అలంకార ధ్వని, రసధ్వని—అని మూడువిధాలుగా ఉంటుంది. "భావనామయమైన, భవ్యావేశపర వశమైన హృదయంయొక్క ఆవిష్కారమే కవిత అన్నది వీరి దృక్పథం"—(Hiriyanna). శబ్దము వ్యంగ్యార్థమును సూచించు వరకే ఆవశ్యకం. నిత్య వ్యవహార భాషవలె కాక, కవిత చెప్పదలచుకొన్న అర్థాన్ని ఆనంద సమ్మిళితం చేసి చెబుతుంది. ఇది శీలానికి కూడా మెరుగు పెడుతుంది. ఈ విధంగా కావ్యంలో 'రసం' ప్రధానం; అంతే కాదు, కావ్యానికి రసమే ఆత్మ. అందుచేతనే "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు.

వేదాంతం-సాంఖ్యం :

రస సిద్ధాంతాన్ని గూర్చి వేదాంతం, సాంఖ్యం—ఈ రెండూ రెండువిధాలుగా చెప్పాయి. విచార దృక్పథం కల సాంఖ్యాన్నిబట్టి ప్రకృతి సర్వాత్మనా సుందరమైనది కాదు. అందులో కొంత వికృతి కూడా ఉంది. ప్రకృతిగతములైన వస్తువులేవీ ఆనందప్రదాలు కావని కాదు. కాని ఆ శాస్త్రం చెప్పేదేమంటే—ప్రకృతిలో సర్వులకు సార్వకాలికమైన ఆనందాన్ని ఇచ్చేది ఏదీ లేదు. కాబట్టి శుద్ధమైన ఆనందం కావాలంటే ఈ వాస్తవిక జగత్తును వదలి వేరొకచోట వెదకాలి. ఇంక ఆనంద దృక్పథం కల వేదాంతం ఇల్లా చెబుతుంది—"ప్రపంచంలో ఉన్నదంతా సౌందర్యమే. దాని ఆంతర సామరస్యాన్ని భంగంచేసే దేమీ లేదు. ఆత్మవాదానికి ఇది

మొదటిసూత్రం. ప్రకృతిసౌందర్యానికి తన్మయుడైపోయే యోగిని మించిన కళాహృదయుడే లేడు. అయితే మనం యోగివలె ప్రతి వస్తువులోను ఆత్మపదార్థాన్ని చూడలేము; కాని ప్రకృతిలో ఉన్న కళాసౌందర్యాన్ని అప్పుడప్పుడు అనుభవిస్తుంటాము. అయినప్పటికి సాధారణంగా మన బుద్ధులు ఈ విశ్వసౌందర్యంపట్ల నిద్రాణంగానే ఉంటాయి అని చెప్పాలి. కళాహృదయుడెప్పుడూ ఆ విశ్వ సౌందర్యం వైపు చూడగల విశిష్ట దృష్టి కలవాడు కావటంచేత అతడు ఆ ఆనందాన్ని పొందుతూ, దాన్ని తాను చేపట్టిన కళా రూపంలో వ్యక్తంచేస్తూ, మన కనుల్ని తెరిపిస్తుంటాడు. నిజానికి మనల్ని సర్వాత్మనా ఆకర్షించగల రూపం ధరించి వచ్చిన ప్రకృతియే కళ అని చెప్పాలి. ఈ పరిశీలనవల్ల తేలిందేమంటే పై రెండు దర్శనాల లక్ష్యమూ ఒకవిధమైన నిర్లిప్తతను కలిగించడమే. వేదాంతాన్ని బట్టి చూస్తే కళాదృష్టి అన్నది తాత్కాలికంగానైనా వ్యక్తిత్వాన్ని మరచిపోయేటట్లు చేయడమే. సాంఖ్యం దీనినే వాస్తవిక జగత్తునుండి తప్పించుకొనడం అంటుంది. వేదాంతం దృష్ట్యా పరమార్థ లక్ష్యానికి కళ ఒక మార్గం. కాని, సాంఖ్యాన్ని బట్టి, వాస్తవికతనుండి తప్పించుకొనటానికి కళ ఒక మార్గం. నిజానికి కళాప్రయోజనం ప్రకృతిలో పరమోత్కృష్టమైనదాన్ని ఆవిష్కరించడం, ప్రకృతికంటె ఉత్తమమైనదాన్ని సృష్టించడం" —(Hiriyanna).

నవరసాలు :

అలంకారశాస్త్రంలో మరొక మహాగ్రంథం జగన్నాథ పండిత రాయలు రచించిన రసగంగాధరం. ఇది రససిద్ధాంతాన్ని సాకల్యంగా చర్చిస్తుంది. ఇందులో తొమ్మిది రసాలు క్రిందివిధంగా పేర్కొనబడ్డాయి :

"శృంగారః కరుణఃశాన్తో రౌద్రో వీరోఽద్భుత స్తథా।
హాస్యో భయానకశ్చైవ బీభత్స శ్చేతి తే నవ."

కళాసృష్టి :

భారతీయ సిద్ధాంతాన్ని అనుసరించి, శ్రీ ఎస్. ఎన్. దాస్ గుప్త వివరించినవిధంగా, కళాఖండం ఆవిర్భవించడానికి కళాకారునిలో ఏడువిధములైన దశలు ఉంటాయి:

1. కళాకారుడు ప్రకృతిస్వరూపములను చక్కగా పరిశీలన చేయాలి.

2. ఆయా రూపాలలోని అంగాంగీభావ సామరస్యాన్ని జాగ్రత్తగా గమనించాలి.

3. వస్తువుకంటె భిన్నంగా, దాని పరిసర స్థితిగతులను గూర్చి విడిగా వివేచన చెయ్యాలి.

4. ఇంతకుముందు చేసిన కళాపరిశీలనవల్ల వాని జ్ఞాపకశక్తి సుశిక్షితం కావాలి.

5. మనఃఫలకమందు రూఢమైన రూపాన్ని కళాసముచితాలైన మాటలలో, రేఖలలో, రంగులలో, ఆకృతులలో, లేదా, ఇతర విధాలలో వ్యక్తం చేయగల కనులు, వ్రేళ్ళు కలిగి ఉండాలి.

6. ఆది తన సృష్టి అనిపించుకోగల ఆత్మీయతాముద్ర విస్పష్టంగా నిరూపించుకొనేటట్లు మననం చెయ్యాలి.

7. తన కళాతత్త్వార్థ మేమిటో సంపూర్ణంగా అవగాహన చేసికోవాలి.

భారతీయ కళాదృష్టిలో మరొక ప్రధానమైన అంశం కళాకారుడు నైతికదృష్టి కలవాడుగా ఉండాలి. నేను వెనుక చెప్పినట్లు ఈ లక్షణాలు ప్రతి కళాసృష్టికి—ప్రాచ్యమైనా, పాశ్చాత్యమైనా—తప్పక ఉండితీరవలసినవే. సంస్కృతీ సంప్రదాయాలు కొన్ని కొన్ని విషయాలలో భిన్నంగా ఉన్నా సర్వ సంస్కృతులు ప్రధాన విషయాలలో ఏకీభావం కలవిగానే ఉంటాయి.

ఆంధ్రజాతి సంస్కృతీ చరిత్ర

ఎమ్. ఆర్. అప్పారావు
వైస్-ఛాన్సలర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

భాష :

భాషను గూర్చి వివరించటంతో ఆరంభంచేస్తాను. తెలుగులో ఆర్య-ద్రావిడ భాషా-సారస్వతాల అంశాలు రెండూ ఉన్నాయి. వీటినే మార్గ-దేశీభేదాలంటారు. 'మార్గ' అనేది సంస్కృత జన్యం; కాగా ఆర్యసంబంధి. 'దేశి' అనేది దేశీయమైనది; కాగా ద్రావిడ సంబంధి. ఈ భాషాభివృద్ధిలో పై రెండు అంశాలు పెనవేసికొని ఉన్నాయనటానికి నిదర్శనం ఈ భాషకు రెండు పేర్లు ఉండటమే—ఒకటి ఆర్య సంబంధి పదమైన 'ఆంధ్రము'; ఇంకొకటి ద్రావిడ సంబంధి పదమైన 'తెలుగు'. తెలుగు "సంశ్లిష్ట" భాష. ఇందులో ప్రాతిపదికకు విభక్తి చేరిస్తే చాలు. అసలు ప్రాతిపదికలో ఎట్టి మార్పు ఉండదు. సంస్కృత ప్రాతిపదికలకు డు, ము, వు, లు అనే తెలుగు విభక్తులు చేరిస్తేచాలు, అవి తెలుగు పదాలై పోతాయి.

ఆంధ్రము లేదా తెలుగు అజంతభాష కావటంచేతా, శబ్దాలలోని మాధుర్యంవల్లా దీన్ని 'ప్రాగ్దేశపు ఇటలీ భాష' (Italian of the East) అంటారు. అంతేకాదు, గాత్ర సంగీతానికి ఈ భాష ఎంతో అనుకూలం. తమిళ దేశంలో, కన్నడ దేశంలో వ్యవహారంలో ఉన్న శాస్త్రీయ కర్ణాటక సంగీత కృతులలో అధికభాగం తెలుగుభాషలోనే ఉండటం గమనార్హం. సంగీతధర్మమైన మాధుర్యగుణం కలిగినదవటంచేతా, సంస్కృత పదాలను సులువుగా తనవిగా చేసికోగల శక్తి కలిగినదవటంచేతా ఆధునిక వైజ్ఞానిక భావాలను వ్యక్తం చేయటానికి భారతీయభాష లన్నింటిలోను తెలుగు భాషయే ఎక్కువ అనుకూలమైనదని పాశ్చాత్య విద్వాంసుడు ఆచార్య జె. బి. ఎస్. హాల్డేన్ పేర్కొన్న విషయం విజ్ఞులందరకూ తెలిసిందే.

చరిత్ర :

'ఆంధ్ర' అనే పదం ప్రప్రథమంగా ఐతరేయ బ్రాహ్మణంలో కనిపిస్తోంది. అశోకుని తరువాత ప్రసిద్ధికి వచ్చిన సాతవాహనుల (లేదా, శాలివాహనుల) కాలంనుంచీ ఆంధ్రులచరిత్ర క్రమవికాసం తెలియ వస్తోంది. నాలుగు శతాబ్దాలపాటు ఆంధ్రదేశాన్ని పరిపాలించిన సాతవాహనులు బౌద్ధులు. మంచి ఉచ్చదశలో ఉన్నప్పుడు ఈ ఆంధ్ర చక్రవర్తుల సామ్రాజ్యం దక్కను పీఠభూమి అంతా వ్యాపించటమే కాక కొంతవరకు ఉత్తర హిందూస్థానానికి, అధికంగా తమిళ దేశానికీ కూడా వ్యాపించింది. తొలి సాతవాహన చక్రవర్తి అయిన శ్రీముఖ సాతవాహనుడు నేటి గుంటూరు జిల్లాలోని అమరావతి రాజధానిగా క్రీ.పూ. 225 నుంచి క్రీ.పూ. 202 వరకు పరిపాలించాడు. అటుపిమ్మట పరిపాలకులైన సాతవాహన రాజులలో క్రీ.శ. 78 నుంచి 102 వరకు పరిపాలన చేసిన గౌతమీపుత్ర శాతకర్ణి చాలా శక్తిమంతుడైన చక్రవర్తి. సాతవాహన చక్రవర్తుల కాలంలో ఆంధ్ర సామ్రాజ్యం మంచి ఉచ్చదశలో ఉండి, శాంతి సౌభాగ్యాలతో తులతూగింది. వివేకవంతులైన ఈ ఆంధ్ర చక్రవర్తుల ఆదరాభిమానాలవల్ల ఆ నాడు కళలు, సాహిత్యం, వాణిజ్యం, మతం బాగా పెంపొందాయి. సుప్రసిద్ధ సాతవాహన చక్రవర్తి అయిన హాలుడు 'గాథా సప్తశతి'ని కూర్చినాడు. తెలుగు గడ్డమీద ప్రభవించిన తొలి కావ్యం 'గాథా సప్తశతి'. సాతవాహనుల మంత్రి అయిన గుణాఢ్యుడు 'బృహత్కథ'ను రచించాడు. ప్రాకృత సాహిత్యంలో ఈ రెండు గ్రంథాలు చాలా ప్రామాణిక రచనలు.

ప్రాకృత భాషాలాలిత్యం, గాథల కమనీయత తెలియటం కోసం గాథాసప్తశతినుంచి ఒకటి రెండు ఉదాహరణలు :

అఉలీణో దోమూహజో తామహురో భో అణం ముహే జావ ।
మురజో వ్వ ఖలో జిణ్ణమ్మిభో అణే వర సమారసఇ॥ [III-53]

—ముఖమున బోనమున్నంత వరకే మద్దెల మధురముగా పలుకును; అది పోగానే విరసముగా మొఱగును. అట్లే ఖలుడు ద్విజిహ్వుడై అన్నము తినుచున్నంతసేపు మధురముగా పలుకును; అది జీర్ణము కాగానే విరసముగా పలుకును!

ఒక హాస్యఘట్టము :.

పాఅపడిఅస్స పఇనో పుట్టిం పుత్తే సమారుహ త్తమ్మి ।
దడమణ్ణుదుణ్ణి ఆఏ విహాసో ఘురీణిఏ ణేక్కంతో ॥ [I-11]

—అలుక మానుమని వేడుచు ఇల్లాలి పాదములయందు పడి యున్న పతి వీపుమీద పుత్రుడెక్కి కేరింతాలు కొట్టుచుండగా ఎంత కోపంతో ఉన్నప్పటికీ ఆ ఇల్లాలు నవ్వు ఆపుకొనలేకపోయింది !

సాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం ఛిన్నా భిన్నమైంది. వేర్వేరు ఆంధ్ర భూభాగాలను ఇక్ష్వాకులు, సాలం కాయనులు, విష్ణుకుండినులు, పల్లవులు, వాకాటకులు, బాదామి చాళుక్యులు ఆయా కాలాలలో పరిపాలించారు. విజయపురి రాజ ధానిగా క్రీ.శ. 220 నుండి 260 వరకు కొనసాగిన ఇక్ష్వాకు రాజుల పరిపాలనా కాలంలో, అచ్చట, సుప్రసిద్ధాలైన బౌద్ధస్తూపాలు, విహా రాలు, విశ్వవిద్యాలయం నిర్మింపబడ్డాయి. మహాయాన బౌద్ధమత ప్రవక్త అయిన ఆచార్య నాగార్జునుడు అచ్చటనే వర్ధిల్లినాడు. ఈ స్తూపాలు, విహారాలు రాణులైన శాంతిశ్రీ, హమ్మసిరినికలచే నిర్మింప బడ్డాయి. ఇక్ష్వాకు రాజులలో శాంతిమూలుడు, వీరపురుషదత్తుడు వైదికమతావలంబులై అశ్వమేధయాగాలు చేశారు. క్రీ.శ. 7 వ శతాబ్దిలో, తూర్పు సముద్రతీర ప్రాంతంలో, గోదావరీ మండలంలో తూర్పు చాళుక్యుల సామ్రాజ్యం వెలసింది. రాష్ట్రకూటులు, చివరి చాళుక్యులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించారు. తూర్పు చాళుక్య చక్రవర్తి అయిన రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్ర వరం (నేటి రాజమండ్రి) రాజధానిగా క్రీ.శ. 1062 వరకు పరి పాలించాడు. మనకు లభించిన తొలి తెలుగు కావ్యం రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవియైన నన్నయభట్టుచేత రచింపబడింది. అటుపిమ్మట, వరంగల్లు రాజధానిగా పరిపాలన చేసిన కాక తీయులు ప్రసిద్ధికి వచ్చారు. క్రీ.శ. 1198 నుంచి 1261 వరకు పరిపాలించిన కాకతీయ గణపతిదేవుడు సముద్ర తీరప్రాంతాన్ని, రాయలసీమను జయించి, తెలుగు ప్రజలందర్ని తన ఏలుబడిలోనికి తెచ్చినాడు. పిమ్మట ఆయన కుమార్తె రుద్రాంబ (క్రీ.శ. 1261-1296) అటు తరువాత ఆమె మనుమడు ప్రతాపరుద్రదేవుడు (క్రీ.శ. 1296-1323) కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించారు. క్రీ.శ. 1323లో మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రతాపరుద్రదేవుని సింహా సన భ్రష్టుని చేయటం సంభవించింది. కాకతీయుల పరిపాలనలో

శాంతి, సౌభాగ్యాలు విలసిల్లినాయి. కళలు, సాహిత్యం పెంపొందాయి. కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థాన కవియైన విద్యానాథుడు రచించినదే నేటికీ భారతదేశమంతటా పఠనపాఠన వ్యవహార ప్రసిద్ధిలోనున్న అలంకారశాస్త్ర గ్రంథం "ప్రతాపరుద్ర యశోభూషణం".

కొందరు సుప్రసిద్ధులైన ఆంధ్రవీరులు తుగ్లక్ జయించిన భూభాగాలను స్వతంత్రం కావించారు. తత్ఫలంగా రెడ్డిరాజులు కొండవీటి రాజ్యాన్ని, వెలమ దొరలు రాచకొండ రాజ్యాన్ని, హరిహర బుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని పరిపాలించసాగారు. క్రీ.శ. **1345**లో బహమనీ రాజ్యం పశ్చిమ దక్కన్ పీఠభూమిలో స్వతంత్ర ముస్లిం రాజ్యంగా నెలకొన్నది. స్వతంత్ర పతిపత్తికోసం ఈ రాజ్యాలన్నింటి మధ్య నిరంతరం పోరు కొనసాగుతూనేఉండేది. క్రీ.శ. 16వ శతాబ్ది ప్రథమ పాదంలో బహమనీ రాజ్యం పతనమైన పిమ్మట చిన్న చిన్న ముస్లిం సంస్థానా లేర్పడ్డాయి. గోల్కొండ, అంటె, నేటి హైదరాబాదు రాజధానిగా కుతుబ్‌షాహీ వంశస్థులు రాజులైనారు. గోలొ్కండ రాజ్యము క్రీ.శ. **1520** లో స్థాపింపబడింది.

ఆదిలో ఒక చిన్న రాజ్యంగా మొదలైన విజయనగర రాజ్యం పిమ్మట మహాసామ్రాజ్యంగా వెలసింది. క్రీ.శ. **1509**నుంచి **1529** వరకు పరిపాలన చేసిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యం చాలా ఉచ్చస్థితికి వచ్చింది. రాయలకాలంలోనే తెలుగు సాహిత్యం క్రొత్తదారిని త్రొక్కింది. ఆనాటి వరకు అనువాదాలే అధికంగా కొనసాగుతూ వచ్చాయి. అందులకు భిన్నంగా ఆనాడు కవులు తమ ఇష్టానుసారం కావ్యరచన చేయటం ఆరంభించారు. శ్రీకృష్ణదేవరాయల కొలువులో 'అష్టదిగ్గజాలు' అనే పేరుతో ఎనిమిది మంది ప్రఖ్యాత కవులు ఉండేవారు. వీరిలో 'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు. విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. **1336** నుంచి **1564** వరకు వర్ధిల్లినది.

'రక్షస్-తంగడి' యుద్ధంలో అళియ రామరాయలు చనిపోవటంతో విజయనగర సామ్రాజ్యం ఛిన్నాభిన్నమైంది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం క్రమంగా గోలొ్కండ కుతుబ్‌షాహీల ఆధిపత్యంలోకి వచ్చింది. కుతుబ్‌షాహీల కాలంలోనే ఫ్రెంచి, డచ్, ఇంగ్లీషు వర్తకులు తూర్పు కోస్తా ఆంధ్ర

ప్రాంతాలైన మద్రాసు, మచిలీపట్టణం, భీమిలిపట్టణం మొదలైన చోట్ల వ్యాపార స్థావరాలేర్పరచుకొన్నారు. క్రీ.శ. 1687లో ఔరంగజేబు గోల్కొండ కుతుబీషాహీలను జయించాడు. ఆనాటినుంచి ఆంధ్రదేశంలోని 'తెలంగాణా' ప్రాంతం 'నైజాములు' అని పిలువబడే అసఫ్‌జాహీ పాలకుల పరిపాలనక్రిందకు వచ్చింది; అప్పటి పరిపాలకుడు నైజామ్-ఉల్-ముల్క్. అసఫ్ జాహీల పరిపాలన క్రీ.శ. 1723లో ఆరంభమై, క్రీ.శ. 1956 లో 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడే పర్యంతం కొనసాగింది. నైజాము, ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు, మహారాష్ట్రులు, మైసూరుకు చెందిన టిప్పుసుల్తాన్—వీరి మధ్య జరిగిన సంఘర్షణలు కారణంగా ఒక ముప్పై సంవత్సరాల కాలంలో ఆంధ్ర భూభాగం ఆక్రమణ విషయంలో అనేకాలైన మార్పులు వచ్చాయి. చివరకు క్రీ.శ. 19వ శతాబ్ది ప్రారంభంలో రాయలసీమ, కోస్తా జిల్లాలు బ్రిటిష్ సామ్రాజ్యం ఆధిపత్యం క్రిందకు వచ్చేశాయి.

ఆంధ్రరాజుల కాలంలో వైదిక-బౌద్ధ మతాలు ఆదరింపబడ్డాయి. విజయనగర సామ్రాజ్యం ఆవిర్భవించిన పిమ్మట హిందూ స్వాతంత్ర్యం, హిందూ నాగరకత సంరక్షింపబడుతూ వచ్చాయి. ఇంతకుముందే పేర్కొన్నట్లుగా సాతవాహన రాజుల కాలంలోను, ఇక్ష్వాకుల కాలంలోను ఆంధ్రదేశంలో బౌద్ధమతంకూడా వర్ధిల్లింది. ఆంధ్రులు ప్రయోగ దృష్టియందలి ఔత్సుక్యంతో క్రొత్త క్రొత్త ఉద్యమాలన్నింటినీ ముందుగా చేపట్టేవారుగా కనిపిస్తారు. ప్రపంచమంతటా బౌద్ధమతంమీద విస్తృతమైన ప్రభావాన్ని చూపిన మహాయాన సిద్ధాంతాన్ని ఆచార్య నాగార్జునుడు వెలయింపజేశాడు. బౌద్ధమత విషయంలో ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ—ఇవి అంతర్జాతీయ ప్రసిద్ధిని పొందాయి, విశ్వవిఖ్యాత యాత్రాస్థలాలైనాయి.

వాస్తుకళ :

వాస్తు కళా క్షేత్రములో ఆంధ్రులు అపూర్వ నిర్మాణాలకు సృష్టికర్తలైనారు. "నాలుగు ఆయక వేదికలను కలపటం చక్కని శిల్పాలతో కూడుకొన్న చలువరాతి పలకలతో ఇటుక కట్టడాలను పూరించటం ఆంధ్రుల ప్రత్యేకత; ఇవి స్తూపాలకు గంభీరతను, అందాన్ని చేకూర్చాయి. అమరావతీ మహా చైత్యమందలి చలువ

రాతి పలకల వరుసలు, ప్రఖ్యాతమైన సాంచీ స్తూపమందలి తోరణాలు బౌద్ధ వాస్తుకళ చరిత్రలో అపూర్వ నిర్మాణాలు".

"విజయపురి ఇక్ష్వాకులు దేవాలయ నిర్మాణోద్యమాన్ని చాలా పట్టుదలతో ప్రారంభించారు. పల్లవులు ఆ ఉద్యమాన్ని కొనసాగించి, అభివృద్ధి పొందించారు. విష్ణుకుండినులు బౌద్ధుల గుహా రామ వాస్తుకళను అనుకరించారు. హిందూ దేవతలకు అంకితాలైన పెక్కు గుహాలయాలను త్రవ్వించి వెలికి తీయించారు. పల్లవులు ఈ పద్ధతినే పాటించి, దీన్ని దక్షిణ హిందూదేశంలో అభివృద్ధి పరచారు. ఆంధ్రదేశానికి సంబంధించిన ఈ ద్వివిధమైన సంప్రదాయం ప్రఖ్యాతమైన మహాబలిపురం రాతిరథాల రూపంలో ఘనీభవించింది."

"దేవాలయ వాస్తుకళకు సంబంధించిన నగర, వేసర, ద్రవిడ అనే ప్రధాన శైలులు మూడున్నూ ఆంధ్రదేశంలో చాళుక్యుల కాలంలో ఆదరణ పొందాయి. వేసర శైలికి పరాకాష్ఠ అని చెప్పబడే వక్రరేఖావృతమైన గోపురం, అమలక శిఖరం—ఇవి కలిగిన వేసరశైలి దేవాలయాలు ఆంధ్రదేశంలో మూడుచోట్ల కనబడుతున్నాయి. తరువాతి చాళుక్యుల కాలానికి సంబంధించిన వాస్తుకళ శైలులను కాకతీయులు అవలంబించి, పెక్కు క్రొత్త పోకడలను మిళితంచేసి తెలంగాణాలోని వరంగల్లు జిల్లాలో ఉన్న హనుమకొండ, రామప్ప మున్నగు ప్రదేశాలల్లో సుందరములైన పెక్కు కట్టడాలను వెలయింపజేశారు."

"మధ్యయుగానికి చెందిన దక్కను చరిత్రలో ఈ దేవాలయాలు హిందూ వాస్తుకళకు పరాకాష్ఠ అని చెప్పవచ్చు. ప్రసిద్ధులైన విజయనగర చక్రవర్తులు ఒక క్రొత్త దేవాలయ నిర్మాణ శైలిని కనుగొన్నారు. ఈ శైలికి సంబంధించిన స్వచ్ఛమైన కట్టడాలను రాయలసీమ జిల్లాలలో చూడవచ్చు."

—మారేమండ రామారావు

పురాతనాలైన ఇట్టి కట్టడాలను దక్షిణ దేశంలో వెల్లూరు, తంజావూరు, మధుర, జింజి, పుదుక్కోట మొదలగు ప్రాంతాలలో కూడా చూడవచ్చు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరులో తెలుగు నాయకరాజులైన రఘునాథ నాయక -

విజయరాఘవ నాయకులు, మధురలో విజయరంగ చొక్కనాథుడు, పుదుకోట్టలో రాజా రఘునాథుడు స్వతంత్రులైనారు.

క్రీస్తుశకారంభంలో, అంటే, సాతవాహన రాజుల కాలంలో ఆంధ్రులు కొందరు ఆగ్నేయ ఆసియా దేశాలకు వలస వెళ్ళారు. ఆయా దేశాలలో కనుపట్టే అమరావతి, విజయపురి, సింహపుర, కళింగ మున్నగు స్థల నామాలు ఆంధ్రులు వలస వెళ్ళారనడానికి తార్కాణాలు. శక సంవత్సరాలలో ఈయబడిన తేదీలుకల శాసనాలు, క్రీస్తు శకారంభ శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో వ్రాయబడిన శాసనాలు, అమరావతి శైలికి చెందిన శిల్పాలు ఈ దేశాలలో కనుగొనబడ్డాయి.

జాతీయోద్యమం :

జాతీయ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రుల దెల్లప్పుడూ ముందంజయే. క్రీ. శ. 1885 లో 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' ఉద్భవించటంతో జాతీయమహోద్యమం ఆరంభమైంది. భారతీయ సైనికుల తిరుగుబాటుతో క్రీ. శ. 1857 లోనే నిజంగా స్వాతంత్ర్య సమరం ఆరంభమైనదన్న సత్యం మనకందరకూ తెలుసు. ఈ సైనికుల తిరుగుబాటును తాంతియాతోపే, ఝాన్సీరాణి మున్నగు జాతీయ మహాయోధులు బలపర్చటంతో సైనికుల తిరుగుబాటు 'స్వాతంత్ర్యసమర' రూపంతాల్చింది. తరువాతి పరిశోధనలను బట్టి భారతదేశంలో బ్రిటిషువారి అధికారం స్థిరపడినప్పటినుంచీ స్వాతంత్ర్యంకోసం సమరం సాగుతూనే ఉన్నదని తెలుస్తోంది. కృష్ణా జిల్లాలోని నూజీవీడుకు చెందిన నారయప్పారావు, దక్షిణ దేశానికి చెందిన పాండ్య సరదారు కట్టబొమ్మ (ఇతడు కూడా ఆంధ్రుడే)— ప్రసిద్ధులైన ఈ ఇరువురు సరదార్లు 18 వ శతాబ్ది రెండవభాగంలో బ్రిటిషువారిని ఎదిరించి పోరాడినారు. క్రీ. శ. 1783 లో నారయప్పారావు ఈస్టుఇండియా కంపెనీవారి అధికారులతో పోరాటం సాగించాడు. ఆయన కుమారుడు రామచంద్ర అప్పారావు కూడా ఈ పోరాటం కొనసాగించాడు. చివరకు నూజీవీటి అప్పారావుతో బ్రిటిషువారు సంధిచేసికొన్నారు. క్రీ. శ. 1795 లో కట్టబొమ్మ ఈస్టుఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు సాగించాడు. కాని దురదృష్టవశాత్తు నమ్మినవారిచేత మోసగింపబడి, బ్రిటిషువారికి చిక్కి, కట్టబొమ్మ ఉరితీయబడినాడు. భార

తీయ స్వాతంత్ర్యసమరం ఆరంభంకావటానికి ఇంచుమించుగా 75 సంవత్సరాలకు ముందే ఈ సరదార్లు ఇరువురు బ్రిటిషువారిపై తిరుగుబాటుకు మార్గదర్శకులైనారు.

ఆంధ్రోద్యమం :

భాష ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్విభజన జరగాలన్న ముఖ్యాశయంతో క్రీ. శ. 1913 లో ఆంధ్రోద్యమం ఆరంభమైంది. ఈ విషయంలో తక్కిన రాష్ట్రాల వారికి ఆంధ్రులే మార్గదర్శకులు. ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్ సంఘం కావాలన్న ఆంధ్రుల కోర్కెను క్రీ. శ. 1917 లో భారత జాతీయ కాంగ్రెస్ అంగీకరించింది. ప్రత్యేకరాష్ట్ర వాంఛ ఆంధ్రులలో ఎల్లప్పుడు ప్రబలంగానే ఉంటూ వచ్చింది. ఈ ఆందోళన ఫలితంగానే క్రీ. శ. 1926 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నెలకొల్పబడింది. నాటినుంచి క్రీ. శ. 1950 వరకు భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య మద్రాసురాష్ట్ర శాసనసభలోను, కేంద్ర శాసనసభలోను చర్చింపబడుతూనే ఉంది. స్వరాజ్యం సిద్ధించిన పిమ్మటనే భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య చేపట్టాలని క్రీ. శ. 1936 లో జాతీయ కాంగ్రెస్ నిర్ణయించింది.

క్రీ. శ. 1947 లో స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆంధ్ర రాష్ట్ర విభజన జరగాలని కాంగ్రెస్‌పై వత్తిడి తీసికొని వచ్చారు ఆంధ్ర నాయకులు. భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్యపై సమగ్రమైన ఒక నివేదిక సమర్పించటం కోసం పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యలతో కూడుకొన్న ఒక ఉపసంఘాన్ని జైపూర్ సభల సమయంలో ఏ.ఐ.సి.సి. నియమించింది. 'జె.వి.పి. రిపోర్టు' అనే పేర ప్రసిద్ధికెక్కిన ఈ ఉపసంఘ నివేదికలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సిఫారసు చేయబడింది. ఈ ఉపసంఘ నియామకానికి ముందే జస్టిస్ ధార్ అధ్యక్షతలో ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సూత్రాన్ని వ్యతిరేకించినప్పటికీ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను ప్రత్యేకంగా ఆలోచించాలని సిఫారసు చేసింది. అయినప్పటికీ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణం విషయంలో ఎట్టి చర్య తీసికోబడలేదు. చివరకు క్రీ.శ. 1949లో ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణవిషయంలో కచ్చితమైన

సూచనలు చేయటంకోసం ఒక విభజన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. క్రీ.శ. 1950 లో ఈ సంఘం తన నివేదికను సమర్పించింది. 1950 జనవరి 26 వ తేదీనాటికి ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడగలదని అందరూ ఆశించారు. కాని, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం నిర్మాణం వాయిదా వేయబడిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో అంతటా నిరాశ అలముకొంది.

ఇట్టి సమయంలో పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర నిర్మాణం కోసం ఆమరణ దీక్షను పట్టారు. ఈ ఉపవాస దీక్షతో ఆంధ్రులలో అలజడి, అశాంతి అధికమైనాయి; ఆంధ్రరాష్ట్రం ఏర్పడనిదే ఆంధ్రులు తృప్తి చెందరన్న విషయం స్పష్టమైంది. చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి అయినారు. ఆమరణ ఉపవాస దీక్ష పట్టి, ఆత్మాహుతి అయిన ముగ్గురు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులలో శ్రీరాములు ఒకరు అయినారు. ఈ ఆత్మాహుతి కారణంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో సమగ్ర నివేదికను సమర్పించటం కోసం జస్టిస్ వాంఛూను కేంద్ర ప్రభుత్వం నియమించింది. క్రీ.శ. 1953 అక్టోబరు 1 వ తేదీన కర్నూలు రాజధానిగా, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్విభజించాలన్న సమస్యను కూలంకషంగా పరిశీలించి, నివేదికను సమర్పించటం కోసం ఫజుల్ ఆలీ అధ్యక్షతలో ఒక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ సంఘం తన నివేదికను క్రీ.శ. 1955 లో సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం ఈ నివేదికను అంగీకరించి, రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై పునర్విభజించటానికి తగిన చర్య తీసికొంది. తత్ఫలితంగా నేటి వివిధ రాష్ట్రాలు 1956 నవంబరు 1 వ తేదీన రూపొందింపబడినాయి. నిజాము పరిపాలన అంతమై, తెలంగాణా కూడా చేరిపోవటంతో ఆంధ్రరాష్ట్రం, 'ఆంధ్రప్రదేశ్' అయి, హైదరాబాదు రాజధానీ నగరం అయింది. ఈ విధంగా నిరంతర సంఘర్షణవల్ల, త్యాగాలవల్ల $3\frac{1}{2}$ కోట్లు ఆంధ్రులు స్వరాష్ట్రాన్ని పొందగలిగారు.

మహిళాలోకం :

శ్రీ కందుకూరి వీరేశలింగంగారు స్త్రీ జనోద్ధరణకు అశేషంగా చేసిన కృషికి ఫలితంగా ఈనాడు స్త్రీలు అనేక రంగాలలో ప్రముఖ

పాత్రను వహిస్తున్నారు. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధురాలే కాక, స్త్రీలకోసమై ఎన్నో విద్యా సంస్థలను నెలకొల్పింది. ఆంధ్ర మహిళా సభను మద్రాసులోనూ, హైదరాబాదులోనూ స్థాపించి స్త్రీలకు ఎన్నో వృత్తి విద్యలలో శిక్షణ నిచ్చే సంస్థగా రూపొందించింది. శ్రీ కేసరిగారు స్థాపించిన "గృహ లక్ష్మి" పత్రిక ఎంతోమంది రచయిత్రులను ప్రోత్సహించింది. ఈనాడు రాష్ట్రంలో ఖ్యాతి నార్జించిన రచయిత్రు లెందరో ఉన్నారు. లత, ముప్పాళ రంగనాయకమ్మ, యద్దనపూడి సులోచనారాణి, అరికెపూడి కౌసల్యాదేవి మొదలైనవారు నవలారంగంలో సిద్ధహస్తు లైనవారు. విద్యారంగంలో డాక్టర్ శ్రీదేవి చాలా కృషి చేశారు. రాజకీయాల్లో శ్రీమతి అమ్మన్నరాజా ప్రముఖ పాత్రను వహించారు.

సాహిత్యం :

ఇప్పుడింక బహుముఖమైన ఆంధ్ర సంస్కృతిని పరిశీలించు దాము. ముందుగా 'సాహిత్యం' తో ఆరంభిస్తాను.

ఇంతకుముందే పేర్కొన్నట్లుగా తూర్పు చాళుక్య రాజు అగు రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి అయిన నన్నయభట్టు క్రీ.శ. 11 వ శతాబ్దిలో అనువదించిన ఆంధ్ర మహాభారతమే మనకు లభించిన తొలి తెలుగు మహాకావ్యం. ఈ ఆంధ్ర మహాభారతం ప్రౌఢరచన కాబట్టి అంతకుముందుకూడా కొన్ని కావ్యాలు రచింప బడి ఉండాలి; కాని, దురదృష్టవశాత్తు అవి అలభ్యాలైనాయి. నన్నయ కవిత్వంలో సంస్కృత పదాల పాలు అధికం; అయి నప్పటికీ అది మనోహరమైన సరళ రచన. తన రచనను గూర్చి నన్నయభట్టు క్రింది విధంగా చెప్పుకొన్నాడు :

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు దెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్."

—ఆది పర్వ. ప్ర. అ. 25 ప.

నన్నయ మహాభారతంలో ఆది-సభా పర్వాలను, అరణ్య పర్వంలో కొంత భాగాన్ని అనువదించాడు. క్రీ.శ. 13 వ శతాబ్దిలో నివసించిన మరియొక తెలుగు మహాకవి తిక్కన మహాభారతాంధ్రీ కరణ భారం వహించాడు. తిక్కన మహాకవియే కాక మహా

సేనాపతి అని కూడ ప్రసిద్ధి. ఆవేశ కారకాలు, ఆకర్షణీయాలు అయిన కొన్ని ఘట్టాలలో తిక్కన కవిత్వం కవితాంశంలోను, నాటకీయ రచనా పద్ధతిలోను వ్యాసుని సంస్కృత భారతాన్ని సులువుగా మించుతుంది. ఈ తిక్కన 'కవిబ్రహ్మ' బిరుదాంచితుడు. క్రీ. శ. 14వ శతాబ్దిలో నివసించిన ఎఱ్ఱాప్రెగ్గడ, నన్నయ తిక్కనలు వదలివేసిన భారతారణ్య శేషభాగాన్ని, హరివంశాన్ని అనువదించి, ఆంధ్ర మహాభారతాన్ని సంపూర్ణం చేశాడు. ఈ ముప్పురు ఆంధ్ర మహాభారత కర్తలను 'కవిత్రయము' అంటారు. ఈ ఆంధ్ర మహాభారతం తెలుగులో తొలి కావ్యమే కాక తెలుగు భాషా-సారస్వతాల విషయంలో ప్రామాణికమైన కావ్యం కూడాను.

క్రీ.శ. 15వ శతాబ్దిలో శ్రీనాథ, పోతనలు అవతరించటంతో తెలుగు సాహిత్యంలో ఒక క్రొత్తయుగం ఆరంభమైంది. శ్రీనాథుడు నిజానికి 'విశ్వకవి'. అంతేకాదు, పాలకులైన రాజులతోపాటు జీవిత భోగభాగ్యాలను పూర్ణంగా అనుభవించాడు; భౌతిక విషయాలలో బాగా నిమగ్నుడైనాడు. జీవితావసాన సమయంలో శ్రీనాథుడు చెప్పిన క్రింది పద్యం గమనింపదగినది:

"కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి,
రత్నాంబరంబు లే రాయఁడిచ్చు?
రంభఁగూడెఁ దెనుంగు రాయరాహుత్తుండు,
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విన్ననమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁగలదు?
కైలానఁగిరిఁ బండె మైలారు విభుఁడేగి,
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు?
భాస్కరుఁడు మున్నె దేవుని పాలికరిగెఁ,
గలియుగంబున నీఁకనుండఁ గష్ట మనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ,
నరుగుచున్నాడు శ్రీనాథుఁడమరపురికి."

సంస్కృతభాషపై బాగా అధికాధికారం కలవాడు శ్రీనాథుడు. అతడు హర్షనైషధాన్ని 'శృంగార నైషధము' అన్న పేరుతో ప్రౌఢంగా ఆంధ్రీకరించాడు. ఆనాటి సామాన్యుల జీవిత-సంప్రదాయాలను చిత్రీకరించిన 'క్రీడాభిరామం' అనే కావ్యాన్ని కూడా శ్రీనాథుడే రచించాడని కొందరు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

రాజులను రాజాస్థానాలను, భోగాలను భాగ్యాలను దూషించి తిరస్కరించిన పోతన శ్రీనాథునకు పూర్తిగా విరుద్ధం. పోతన భాగవతాన్ని ఆంధ్రీకరించాడు. ఆయన అనువాదం పద్యానికి పద్యంగా సాగలేదు; అనువాదం మూలంకంటె అధికమైంది. పోతన భక్త్యావేశం సాటిలేనిది. ఆయన శైలి ధారాళంగా, శ్రావ్యంగా, లయానుగుణంగా ఉంటుంది. పోతన పద్యాలు తెలుగు ప్రజలకు చాలా ప్రీతిపాత్రాలైనాయి.

పిమ్మట శ్రీకృష్ణదేవరాయల యుగం ఆరంభమైంది. ప్రబంధ రూపం తాల్చిన తెలుగు సాహిత్యానికి అది స్వర్ణయుగం. తెలుగు భాషయందు తనకు గల గాఢాభిమానాన్ని, ఆ భాషా వైశిష్ట్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు క్రింది విధంగా చాటిచెప్పినాడు :

"తెలుఁగదేల యన్న దేశంబు దెలుఁగు, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొ కండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స."

—ఆముక్తమాల్యద, 1–15

ఇంతకుముందు చారిత్రక విభాగంలో పేర్కొన్నట్లుగా ప్రసిద్ధ విజయనగర కవులు ఎనమండుగురు. వారు పురాణానువాదాలతో తృప్తిచెందక, రచనా స్వాతంత్ర్యం పొందారు. రామరాజభూషణుని మాటలలో ప్రబంధ కవుల రచనా విధానం క్రింది విధంగా స్పష్టమవుతోంది :

"కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁ బుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్."

—వసుచరిత్ర, 1–19

'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన ఈ ఎనమండుగురిలోను సుప్రసిద్ధుడు; అంతేకాదు పెద్దన 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదాంచితుడు. ఈ కావ్యం వైశాల్యంలో పెద్దదైనప్పటికీ ఆసాంతం మనోహరంగా ఉంటుంది. మనుచరిత్ర రచన ఉదాత్తమై, భాష సంస్కృత పదబహుళము, శ్రావ్యము, లయాన్వితమునై అలరారుతూ ఉంటుంది. తెలుగు భాషలో ఇది ఒక ప్రామాణికమైన రచన. శ్రీకృష్ణదేవరాయలు ఈ మహాకవిని

"ఎదురైనచోఁ దన మద కరీంద్రము నిల్పి, కేలూత యొసఁగి యొక్కించు" కొనే వాడట !

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కవి ; 'ఆముక్త మాల్యద' అనే ప్రౌఢకావ్యాన్ని రచించాడు. ఈ కావ్య రచనాశైలి జటిలమై, నారికేళపాకంలో ఉంటుంది. ముక్కుతిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు మున్నగు మహాకవులంతా ఈ యుగానికి చెందిన వారే. క్రీ.శ. 16వ శతాబ్ది రెండవ భాగానికి చెందిన పింగళి సూరన 'కళాపూర్ణోదయము' అనే ఉత్తమ కావ్యం రచించాడు ; దీన్ని 'కావ్యరూపంలో ఉన్న నవల' అంటే అతిశయోక్తికాదు. అంతేకాదు, ఇది కేవలం కల్పిత కథ కూడాను. అపూర్వమైన విధంగా సంగీత సాహిత్యాలు మేళవించిన రామరాజ భూషణుని 'వసుచరిత్ర' ఆనాటి మరియొక ఉత్తమ కావ్యం. ఆలంకారిక పదప్రయోగానికి, భావనా వైశిష్ట్యానికి, వ్యంగ్య సంపదకు, శ్లేష మాధుర్యానికి ప్రత్యేకత వహించిన వసుచరిత్ర తెలుగులోని పంచ కావ్యాలలో విశిష్ట స్థానం సంపాదించుకొంది.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం కొందరు తెలుగు కవులు దక్షిణదేశానికి తరలివెళ్లి తంజావూరు, మధుర మొదలగు ప్రాంతాలలో స్థిరపడ్డారు. అచ్చట, తెలుగు సాహిత్యంలో వారొక కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. సారంగు తమ్మయ్య రచించిన 'వైజయంతీ విలాసము', చేమకూర వేంకటకవి రచించిన 'విజయ విలాసము' తెలుగులో సుప్రసిద్ధాలైన కావ్యాలు. "ప్రతి పద్యము నందుఁ జమత్కృతి గలుగం జెప్ప నేర్తు"నని చెప్పుకొన్నవాడు చేమకూర వేంకటకవి. క్రీ.శ. 18వ శతాబ్దిలో పలువురు కవులు రచనలు చేసినప్పటికీ చెప్పుకోదగిన గొప్ప కావ్యాలేమీ వెలువడ లేదు. కవుల రచనలలో స్వాతంత్ర్యంకాని, శైలిలో రమ్యతకాని కన్పట్టదు. క్షీణదశ ప్రారంభమైనదని చెప్పవచ్చు.

తెలుగు వాఙ్మయశాఖలలో చెప్పుకోదగిన విశిష్టమైన శాఖ 'శతక' వాఙ్మయం. భక్తి, నీతి, వేదాంతం, విమర్శ—అనే అంశాలు శతక రచనకు ప్రేరేపకాలు. క్రీ.శ. 17వ శతాబ్దిలో నివసించిన వేమన శతక కవులలో సుప్రసిద్ధుడు.

క్రీ.శ. 15వ శతాబ్దిలో నివసించిన అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామి భక్తులలో అగ్రేసరుడు. అన్నమాచార్యులు తెలుగులో రచించిన 'వేంకటేశ్వర వచనాలు' సుప్రసిదాలైనాయి.

క్రీ.శ. 18 వ శతాబ్దిలో నివసించిన క్షేత్రయ్య సుప్రసిద్ధుడైన పదకర్త. క్షేత్రయ్య పదాలు దాక్షిణాత్య నృత్యానికి నికషోపలాలు. క్రీ.శ. 18 వ శతాబ్ది తొలి భాగంలో నివసించిన త్యాగరాజు కర్ణాటక సంగీత సంప్రదాయానుసారంగా తెలుగు భాషలో రమ్యమైన కృతులు రచించిన సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. "నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా? నిజముగ బల్కు మనసా!" (కల్యాణి-చాపు) అని తర్కించుకొని, "సుమతి త్యాగరాజ నుతుని కీర్తన"మే సుఖమని నిర్ణయించు కొన్నవాడు త్యాగరాజు. "సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాతండ్రి" (లలితా-రూపకం) అని పాడుకొన్న త్యాగరాజునకు రామునిపై గల భక్తి, ఆయన కృతుల యందలి పదలాలిత్యం, సారళ్యం సాహిత్య ప్రపంచంలోను, భక్తి సంగీత విషయంలోను నిరుపమానము లైనాయి. ఆనునాసిక్యం, అజంతత్వం, మహా ప్రాణాక్షర రాహిత్యం కారణాలుగా తెలుగు భాష మధురతరమై సంగీతానికి చాలా అనుకూలమైంది. త్యాగరాజు వాక్కులలో అది భక్తి సంగీతానికి పరమమైన సాధన అయింది.

19 వ శతాబ్ది మధ్యభాగంలో, ఆంగ్ల-వంగ సంప్రదాయాల ప్రభావం బాగా ప్రసరించిన కాలంలో ఆధునిక తెలుగు వాఙ్మయం ఆరంభమైనదని చెప్పవచ్చు. క్రీ.శ. 19 వ శతాబ్ది మధ్యభాగం వరకు తెలుగులో వచనవాఙ్మయం పెంపొందనేలేదు. ఆధునిక తెలుగు వచన రచనకు కందుకూరి వీరేశలింగం మార్గదర్శకులు. ఆయన నాటకాలు, జీవిత చరిత్రలు రచించటంమాత్రమే కాక స్వీయచరిత్ర కూడా రచించుకొన్నారు. అంతేకాదు సాహిత్య సాధనగా వచన రచనను తీర్చిదిద్దినారు. కృష్ణాపత్రిక సంపాదకులైన ముట్నూరి కృష్ణారావు తెలుగు పత్రికారచనలో ప్రామాణికులు. ఆయన మంచి వ్యాస రచయిత. రాజకీయ, సాహిత్య, వేదాంత, సంఘసంస్కరణాది విషయాలను సుస్పష్టంగా చర్చించటానికి చాలా అనువైన ఒక క్రొత్త శైలిని వారు అవలంబించారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు ఛలోక్తులను విసరటంలో, హాస్యరచనలో అందెవేసిన తెలుగు రచయిత. ఆయన శైలి తెలుగుదేశ మంతటా ప్రజాదరణ పొందింది.

క్రీ.శ. 19 వ శతాబ్ది ఆరంభంలో ప్రామాణికమైన, సమగ్రమైన తొలి తెలుగు వ్యాకరణం ('బాల వ్యాకరణం') రచించినవాడు చిన్నయసూరి.

'తిరుపతి వేంకటకవులు' అను పేర సుప్రసిద్ధులైన గొప్ప జంటకవులు దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి. వారు తమ అవధానాలతో తెలుగు కవిత్వాన్ని ప్రజలకు సన్నిహితంచేశారు. సరళము, మనోహరము, ప్రామాణికము అయిన భాషలో వారు రచనలు చేశారు. వారి కావ్యాలు, నాటకాలు కూడా తెలుగునాట చాలా ప్రసిద్ధిపొందాయి. ఈ జంటకవులలో చెళ్ళపిళ్ళవారికి శిష్యసంపద అధికము. నాడు ప్రసిద్ధికెక్కిన తెలుగు కవులలో నూటికి తొంబదిమంది వారి శిష్యులే. విశ్వనాథ సత్యనారాయణ పేర్కొన్నట్లుగా

"తనయెద యెల్లమెత్తన, కృతప్రతి పద్యము నంతకంటె మె
త్తన తన శిష్యులన్న నెడదంగల ప్రేముడి చెప్పలేని మె
త్తన యయి శ్రుతుపర్వత శతారము సత్కవి చెళ్ళపిళ్ళ వేం
కన గురువంచఁ జెప్పికొనగా నది గొప్ప తెలుంగునాఁడునన్."

వంగ సాహిత్యంచేత—ముఖ్యంగా రవీంద్రనాథ టాగూర్ చేత—ప్రభావితులైన రాయప్రోలు సుబ్బారావు గారితో తెలుగు కవిత్వం క్రొత్తమార్గం త్రొక్కింది. ఆయన నాందీపూజ కావించిన కాల్పనిక సంప్రదాయాన్ని తెలుగులో 'భావకవిత్వము' అంటారు. ఈ భావకవిత్వ సంప్రదాయం కృష్ణశాస్త్రి, అబ్బూరి, రామిరెడ్డి, జాషువా, నండూరి సుబ్బారావు ప్రభృతుల చేతుల్లో తీర్చిదిద్ద బడింది. పీడితజాతుల, అస్పృశ్యుల కష్టాలను మనోహరమైన కవిత్వంలో చిత్రించిన సమర్థుడైన తొలి హరిజన క్రిస్టియన్ కవి గుర్రం జాషువా. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వర రావులు క్రొత్తయుగానికి చెందినవారు; వారి 'సౌందరనందము' ఒక ఉత్తమ ఆధునిక తెలుగు కావ్యం. పింగళి లక్ష్మీకాంతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుభాషా శాఖాధ్యక్షులుగా చిరకాలం పని చేసి తెలుగు భాషా-సాహిత్యాల బోధనను సువ్యవస్థితం చేశారు. ప్రసిద్ధ కవులైన గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు రాయలసీమప్రాంతం కవులు.

విశ్వనాథ సత్యనారాయణ . బహుముఖ ప్రజ్ఞావంతుడైన రచయిత. ఆయన వచనము, నాటకము, గేయము, కథానిక మున్నగు పలుశాఖలలో ఉదాత్తమైన రచనలు చేసి తెలుగు సాహిత్యానికి పుష్టి చేకూర్చారు. వారి 'శ్రీమద్రామాయణ కల్ప వృక్షము' ఆధునికయుగంలో వెలువడిన ఒక మహాకావ్యం. "కవి

ప్రతిభలోన నుండును గావ్య గతశతాంశముల యందుఁ దొంబది యైనపాళ్ళు ! ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది నవకథాధృతినిమించి" అన్న ప్రత్యయంతో ఆరంభమైనదీ మహా కావ్యరచన.

ఇంక యువతరం కవులలో శ్రీ శ్రీ ~~చాలా పగతి~~ భావాలుగల కవి. ఆయన రచనాపద్ధతి ~~అధికాస్తకవితకు~~ చెందింది; ~~ఖండ~~ స్సంప్రదాయాలన్నింటిని త్రోసిపుచ్చి రచనలు సాగించారు. శ్రీ శ్రీ పూర్తిపేరు శ్రీరంగం శ్రీనివాసరావు.

నండూరి సుబ్బారావు 'యెంకిపాటలు' అధునికకాలంలో వెలువడిన ఉత్తమ గేయకావ్యం.

ఒక ఉదాహరణ :

ఆరి పేయవె దీపమూ !
యెలుగులో నిమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

జిమ్ముమంటా తోట సీకట్రైపోవాలి,
సీకట్లో సూడాలి నికళ్ళ తళతళలు ! ॥ఆరిపేయవె॥
తళుకుతో సిరూపు తలుసుకొని తలుసుకొని,
సీకట్లో నాకళ్ళు సిల్లులడ సూడాలి ! ॥ఆరిపేయవె॥
సూపులే ఆపేసి, రూపువూసే మరిసి,
పొకరెరుగ కింకొకరు పొరిగి నిదరోదాము ! ॥ఆరిపేయవె॥

కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్తు గ్రాంథికభాషావాదానికి పట్టుగొమ్మ కాగా, గిడుగువారి అడుగుజాడల్లో గుంటూరు నవ్య సాహిత్యపరిషత్తు శిష్టవ్యావహారికానికి చేదోడు వాదోడు అయింది.

వీరేశలింగం ప్రభృతుల సంస్కరణ ధోరణి సాహిత్యం ప్రచురప్రచారంలో ఉండగా, త్రిపురనేని రామస్వామిగారి తిరుగు బాటు కవిత్వం తెనుగునాట హేతువాదానికి హారతులెత్తింది. క్రమంగా దేశంలో వచ్చిన భావవిప్లవం సాహిత్యరంగంలో రూపు దాల్చి, అభ్యుదయసాహిత్యమూ, విప్లవసాహిత్యమూ యుగచేతనకూ, యువచేతనకూ వేయిదీపిక లెత్తుతున్నాయి; కొత్త గొంతులు వినిపిస్తున్నాయి.

తెలుగులో ఆధునిక సాంఘిక నవల విషయంలో ఉన్నవ లక్ష్మీ నారాయణ మార్గదర్శకులు. సరళము, సహజము అయిన శైలిలో

రచింపబడిన వారి 'మాలపల్లి' హరిజనుల జీవితంపై వ్రాయబడిన తొలి ఉత్తమ సాంఘికనవల.

గుడిపాటి వెంకటచలం సాంఘిక విప్లవవాది. ఆయన కథానికలు, నాటికలు ప్రజలలో గొప్ప అలజడిని కలిగించాయి. సాంఘిక నీతిసూత్రాలకు ఆయన కట్టుబడకపోవటాన్ని అవినీతి క్రింద జమకట్టి చాలామంది అలజడి పొందారు. 'కథక చక్రవర్తి' చింతాదీక్షితులు, అంతర్జాతీయ బహుమానం గడించుకొన్న పాల గుమ్మి పద్మరాజు ప్రసిద్ధ కథానికా రచయితలు. ఉమర్ ఆలీషా, జాషువా, జోసెఫ్‌లు హైందవేతరులలో ప్రసిద్ధ తెలుగు కవులు. సురవరం ప్రతాపరెడ్డి, పద్మశ్రీ మాడపాటి హనుమంతరావు, డాక్టరు బూర్గుల రామకృష్ణారావులు తెలంగాణా ప్రాంతంలో ఆధునిక సాహిత్యోద్యమానికి కర్ణధారులు; వారు ముగ్గురూ ఉర్దూభాషలో కూడా మంచిపండితులు. దాశరథి, నారాయణరెడ్డి మున్నగు యువ రచయితలు పలువురు బహుముఖప్రజ్ఞావంతులై వివిధ సాహిత్య శాఖలలో రచనలు సాగిస్తున్నారు.

బాలసాహిత్యం తెలుగులో ఇటీవలనే ప్రవేశించిన శాఖ. ఈ రంగంలో చాలామంది కృషిచేశారు. శ్రీ చింతా దీక్షితులుగారు ఈ సాహిత్యానికి తెలుగులో శ్రీకారం చుట్టారు. రేడియోలో పిల్లల కార్యక్రమాలలో ఎన్నో కొత్త మార్గాలు తొక్కిన శ్రీ న్యాపతి రాఘవ రావుగారూ, వారి సతీమణి కామేశ్వరమ్మగారూ కూడా బాలసాహిత్య సృష్టికర్తలే.

ఇంక తెలుగుభాషావిషయంలో గిడుగు రామమూర్తి ప్రథమ గణ్యులు. తెలుగుసాహిత్యంలో వ్యావహారికభాషకు ప్రవేశం కలగటానికి ఆయన మార్గదర్శకులు. వారికి సహాయకులై, అనుచరులై పనిచేసిన వారి కుమారుడు డాక్టర్ గిడుగు వేంకటసీతాపతి తండ్రితో సాటిరాగల విద్వాంసులు. సీతాపతి తోడ్పాటుతో తెలుగులో వివిధ సాహిత్యశాఖల స్వేచ్ఛాభివృద్ధికి వ్యావహారికభాష సజీవ సాధనమైంది. రామమూర్తి ప్రభావంవల్ల పురాతనభాషస్థానంలో సజీవభాష అయిన వ్యావహారికభాష స్థిరపడింది, ఇంక యువతరం వారిలో వడ్లమూడి గోపాలకృష్ణయ్య వ్యావహారికభాషోద్యమాన్ని సమర్థవంతంగా చేపట్టి, దానికి ప్రత్యేక వ్యాకరణం కూడా రచించారు. తెలుగుభాషాప్రపంచంలో ఇంకా సుప్రసిద్ధులైనవారు వర్ధుల

చిన సీతారామస్వామిశాస్త్రి, డాక్టర్ చిలుకూరి నారాయణరావు, గంటిజోగి సోమయాజి, కోరాడ రామకృష్ణయ్య, నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి.

ఇంక విమర్శ విషయంలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి మార్గదర్శకులు; వారి 'కవిత్వతత్త్వ విచారము' ప్రామాణికమైన రచన. అంతేకాదు, రామలింగారెడ్డి ఆంధ్ర - ఆంగ్ల భాషలలో గొప్ప వక్తలు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చెఱుకువాడ నరసింహం పంతులు కూడా తెలుగులో గొప్ప వక్తలు.

క్రీ.శ. 19వ శతాబ్ది చతుర్థపాదంలో తెలుగు సాహిత్య ప్రపంచంలో పరిశోధనకు శ్రీకారం చుట్టినవారు మానవల్లి రామ కృష్ణకవి. వీరు 'ఎమ్. ఆర్. కవి' అన్న ప్రసిద్ధనామంతో అంతర్జాతీయ ఖ్యాతిని గడించుకొన్నారు.

సంగీతం :

కర్ణాటక, హిందూస్థానీ సంప్రదాయాలుగా చీలిపోయినప్పటికీ భారతీయ సంగీతం ప్రధానంగా ఒకటే. ప్రాచీన మహర్షులైన భరత, నారద, మతంగాదులు భారతీయ సంగీతానికి శాస్త్రాదులు రచించి, సువ్యవస్థితం చేశారు. ఈ శాస్త్ర లన్నింటిలో భరతుని 'నాట్యశాస్త్రం' సంగీత, నృత్య, నాట్యకాలవిషయంలో ప్రామాణిక మైన రచన, కాకతీయ గణపతిదేవుని సేనాపతి అయిన జాయప సేనాని సంగీత నృత్యాలలో విద్వాంసుడై సంగీత రత్నావళి, నృత్య రత్నావళి అనే శాస్త్రగ్రంథాలను రచించాడు. దేవగిరిరాజైన సింఘణ భూపాలుని ఆస్థాన సంగీత విద్వాంసుడు శార్ఙ్గదేవుడు 'సంగీత రత్నాకరము' అనే ప్రామాణిక శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ముస్లింలు భారతదేశాన్ని జయించిన పిమ్మట ఉత్తరభారతంలోని సంగీతం ఇస్లాం ప్రభావానికి లోనై దక్షిణభారత శైలికి భిన్నంగా చాలా మార్పులకు లోనైనది.

క్రీ.శ. 15వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులు, ఆయన కుమారులు, మనుమలు వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ పెక్కు 'పదాలు' రచించారు. క్రీ.శ. 17వ శతాబ్దిలో క్షేత్రయ్య సంగీత శాస్త్రసమ్మతంగా పదరచన సాగించి, శృంగారరసానికి కళాత్మకంగా పరిపూర్ణత్వం కల్పించాడు. క్రీ.శ. 19వ శతాబ్ది అరంభంలో

త్యాగరాజు తెలుగులో వాగ్గేయకారుడై, అద్వితీయమైనవిధంగా కృతులను రచించి, పాడి, కర్ణాటక సంగీతాన్ని తీర్చిదిద్దినాడు. ఆయన సంగీతాన్ని 'నాదబ్రహ్మ' రూపంగా ఉపాసించినాడు. రామునియందు ఆయనకుగల పరమభక్తి సాటిలేనిది. సంగీతం ద్వారా ఆయన ఆత్మసిద్ధిని పొందాడు. శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజు—ఈ ముప్పురు కర్ణాటక సంగీతానికి ప్రఖ్యాత త్రిమూర్తులు.

ఆధునికకాలంలో సంగీతానికి తమిళదేశంలో ఉన్నంత ప్రజాదరణ అంధ్రదేశంలో లేకపోయినప్పటికీ ఉపేక్షింపబడలేదని మాత్రం చెప్పవచ్చు. విజయనగరం మహారాజా ఆనందగజపతి సంగీతాన్ని అభిమానించి, ఒక ప్రత్యేక సంగీత కళాశాలను స్థాపించారు. ఆ కళాశాలాధ్యక్షులుగా పనిచేసిన విజయనగరం నివాసి ఆదిభట్ల నారాయణదాసుకవి, వాగ్గేయకారుడు, హరికథాప్రవీణుడు. పిఠాపురం నివాసి అయిన తూమరాడ సంగమేశ్వరశాస్త్రి, విజయనగరం నివాసి అయిన వీణ రామయ్య గొప్ప వైణికులు. సజీవులైన వారిలో ఈమని శంకరశాస్త్రి ప్రఖ్యాత వైణికులు. ఇటీవలనే పరమపదించిన పద్మశ్రీ ద్వారం వేంకటస్వామి నాయుడు కర్ణాటక సంగీతంలో, ఫిడేలువాద్యంలో అగ్రగణ్యులు. 'ఫిడేలు నాయుడు' అన్న పేర ఆయన సుప్రసిద్ధులు. ఆయన తొలి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన సంగీత విద్వాంస పదవిని అలంకరించారు.

బాలమురళీకృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, సోమేశ్వరరావు, వాసా కృష్ణమూర్తి, వోలేటి వెంకటేశ్వర్లు, శ్రీమతి టి. టి. సీత, శ్రీమతి శ్రీరంగం గోపాలరత్నం ప్రభృతులు కర్ణాటక సంగీతంలో సుప్రసిద్ధులు. డాక్టరు శ్రీపాద పినాకపాణి గాయకులే కాక సంగీత శాస్త్రజ్ఞులు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గాయకులేకాక సంగీతశాస్త్ర విద్వాంసులు. హైదరాబాదులో హిందుస్థానీ సంగీత గాయకులు పలువురున్నారు. ఈ చిన్నవ్యాసంలో వా రందరిని గూర్చి పేర్కొనటం సాధ్యం కాదు. హైదరాబాదులోని ప్రభుత్వ సంగీత నృత్య కళా శాలలో కర్ణాటక-హిందుస్థానీ సంగీత సంప్రదాయాలు రెండింటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోంది.

బాలాంత్రపు రజనీకాంతారావుగారు లలితసంగీతరంగంలో అసమానమైన ప్రతిభను వ్యక్తపరిచారు. వీరు కృష్ణశాస్త్రిగారి రచనలకు మంచి సంగీతాన్ని సమకూర్చారు.

నృత్యం :

ఆంధ్రదేశంలో యక్షగానాలకు, లేదా, నృత్య నాటకాలకు ప్రజాసామాన్యంలో చాలా ఆదరణ ఉండేది. ఇవి ప్రాచీనకాలంలో శ్రీశైలం, అహోబిలం మున్నగు దేవాలయాలకు చెందిన ఆటవిక జాతులవారిచేత ఆడబడేవి. 'అభినయ దర్పణం', 'భరతార్ణవం' రచించిన నందికేశ్వరుడు ఆంధ్రుడని తలంపబడుచున్నాడు. జాయపసేనాని నృత్తరత్నావళినిగూర్చి ఇంతకుముందే పేర్కొన్నాను. క్రీ.శ. 13వ శతాబ్ది ప్రాంతాలలో, సిద్ధేంద్రయోగి గురుత్వంలో, కృష్ణాజిల్లాలోని కూచిపూడి బ్రాహ్మణులు భామాకలాప నృత్యాన్ని వృత్తిగా స్వీకరించారు. అటుపిమ్మట నృత్య నాటక ప్రదర్శనాలు కూడ అభ్యసించారు. సిద్ధేంద్రయోగి గొప్ప గాయకుడు ; నర్తకుడు. ఆయన ప్రభావంవల్లనే కూచిపూడి గ్రామ బ్రాహ్మణులంతా ఈనాడు కూడా ఈ భామాకలాపాన్ని అభ్యసిస్తున్నారు ; వారి పేరుమీదుగా ఈ నృత్యం 'కూచిపూడి భామాకలాపం' అని పిలువబడుతోంది. ఈ భామాకలాపం అభినయ విద్యకు నికషోపలం అంటే అతిశయోక్తి కాదు.

ఈ కూచిపూడి నర్తకులు కొందరు తొలుత విజయనగర చక్రవర్తుల గౌరవాదరాలను పొంది, ఆ సామ్రాజ్య పతనానంతరం తంజావూరు రాజ్యానికి తరలివెళ్ళి, అచ్చట నాయకరాజుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. కూచిపూడి నర్తకుల భామాకలాపం నేటి తంజావూరు భరతనాట్యానికి, కూచిపూడి నర్తకుల నృత్యనాటకాలు, నేటి మేలట్టూరులోని నృత్యనాటకాలకు మార్గదర్శకాలైనాయి. మహారాజ శరభోజీ (క్రీ. శ. 1798-1832) ఆస్థాన నృత్య విద్వాంసులైన చిన్నయ, పొన్నయ, వడివేలు, శివానందం అనే ప్రఖ్యాత సోదరులు భామాకలాపంలోని, రాజనర్తకీ దేవదాసీ సంప్రదాయాలలోని సారాన్ని గ్రహించి, నేడు తంజావూరు 'భరతనాట్యం' అని పిలువబడే నృత్య విధానాన్ని రూపొందించారు. "కూచిపూడి నృత్యం ప్రధానంగా పురుషుల నృత్యం ; తంజావూరు భరతనాట్యం ప్రధానంగా స్త్రీల నృత్యం. ఈ రెండువిధాలైన నృత్యాలు ఒకే మూలనుంచి ఉద్భవించాయి. రెండింటికి అభినయ దర్పణం, భరతార్ణవం, రసమంజరి అనేవి ప్రామాణిక శాస్త్రగ్రంథాలు."

—పోణంగి శ్రీరామ అప్పారావు

నేటికీ కూచిపూడి నృత్యం ప్రసిద్ధిలో ఉంది. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి ఆధునికులలో ప్రామాణికులైన గురువులు; ఆయన కొలదికాలం క్రిందటనే పరమపదించారు. నేడు కూచిపూడి నృత్య విద్వాంసులలో సుప్రసిద్ధులైనవారు: భరతకళాప్రపూర్ణ వేదాంతం రాఘవయ్య, వేదాంతం సత్యనారాయణశర్మ, చింతా కృష్ణమూర్తి, వెంపటి సత్యం, భాగవతుల రామకోటయ్య ప్రభృతులు. తదితర నృత్య సంప్రదాయాలలోను, జానపద నృత్యాలలోను సుప్రసిద్ధులైనవారు కొంతమంది ఉన్నారు. నటరాజ రామకృష్ణ నృత్యసంప్రదాయాలన్నీ తెలిసినవారు; అంతేకాదు, సమర్థులైన గురువులు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ఆధ్వర్యాన ఒక నృత్య శిక్షణా శిబిరం కూడా నిర్వహించారు. కాకతీయ దండనాథుడు జాయపసేనాని రచించిన "నృత్త రత్నావళి" ఆధారంగా పేరిణీ శివతాండవాన్ని పునర్నిర్మించారు. ఏనాడో లుప్తమైపోయిన నృత్య విశేషాన్ని పునర్నిర్మించి ప్రదర్శించడం సులభం కాదు. పేరిణీ శివతాండవానికేకాక, దేవాలయ ఆరాధనా నృత్యాలకు కూడా ప్రాణప్రతిష్ట చేసిన ఘనత శ్రీ నటరాజ రామకృష్ణగారికి దక్కుతుంది. వీరి శిష్యుడు చిరంజీవి సుదర్శన్ పేరిణీ శివతాండవంలో అసమానమైన నేర్పు సంపాదించాడు. అతనికి మంచి భవిష్యత్తు ఉంది. సంపత్కుమార్ జానపద నృత్యాలలో కృషిచేశారు. కోరాడ నరసింహారావు విదేశాలలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి, పేరుపొందారు. కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, శ్రీరంగం శ్రీనివాసరావు ప్రభృతుల భావగీతాలను నృత్యానికి అనుగుణంగా మలచటంలో బి. వి. నరసింహారావు మార్గదర్శకులు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యసంప్రదాయాలలో కుమారి యామినీ కృష్ణమూర్తి ప్రసిద్ధి పొందారు. యువతరం వారిలో కనకదుర్గ, జయశ్రీ, సుమతీ కౌశల్, విజయలక్ష్మీ వర్ధిష్ణువులైన నర్తకీమణులు. శ్రీమతి రత్నపాప కేవలం నర్తకీమణేకాక ఆంగ్లసాహిత్యంలో పట్టభద్రురాలు. లలితసంగీతంలో పేరుపొందిన సీతా అనసూయల పేరు అందరికీ పరిచితమే. వీరిలో అనసూయ పుత్రిక రత్నపాప. ఈమె విదేశాలలోకూడా ఎన్నో ప్రదర్శనలిచ్చివచ్చింది. కూచిపూడి, భరతనాట్య సంప్రదాయాలు రెండింటికి నేడు ప్రజాదరణ అధికంగా ఉంది. అందుచేత ఈ నృత్యాలు నేర్చుకొనటానికి పలువురు బాలికలు ముందుకు వస్తున్నారు; తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు.

నాటకం :

సాహిత్య శాఖలన్నింటిలోను నాటకం ఉత్తమోత్తమమైనప్పటికీ, సంస్కృత సాహిత్యంలో నాటకానికి ఉన్నతస్థానం ఉన్నప్పటికీ ('నాటకాంతం సాహిత్యం') ఇంతకుముందు పేర్కొన్న యక్షగానాలను తప్ప ప్రాచీనులైన కవులెవ్వరూ తెలుగులో నాటకాలు రచింప లేదు. ఈ ప్రాచీన కవులందరకు కాళిదాసాదుల నాటకాలు సుపరిచితాలే; అయినప్పటికీ క్రీ. శ. 19 వ శతాబ్ది 7 వ దశాబ్దంవరకు తెలుగులో నాటక రచనకు వారెవ్వరూ పూనుకోలేదు. ఇందలి రహస్యం ఇంకా అగోచరంగానే ఉంది. ఆధునికాంధ్ర నాటక రచనా ప్రదర్శనాలకు కందుకూరి వీరేశలింగం పంతులు (క్రీ. శ. 1848-1915) మార్గదర్శకులు. అంతకుముందే ఇద్దరు ముగ్గురు తెలుగు నాటక రచనకు పూనుకొన్నప్పటికీ అవి ప్రదర్శన భాగ్యానికి నోచుకోలేదు. ఈస్టు ఇండియా కంపెనీ అధికార్లు భారతదేశంలో పాదుకొల్పిన 18వ శతాబ్ది ఆంగ్ల నాటక రంగస్థల సంప్రదాయాన్ని అనుసరించి, మహారాష్ట్ర, కర్ణాటక నాటక సంఘాలవారు క్రీ. శ. 1880 ప్రాంతాలలో తెలుగు దేశంలో నాటక ప్రదర్శనాలిచ్చారు. వారు నిర్మించిన రంగస్థలాన్ని, నాటకశాలను, తొందరలో వ్రాసి ప్రదర్శింపజేసిన తమ నాటకాలకు, వీరేశలింగం పంతులు ఉపయోగించారు.

'ఆంధ్ర నాటక పితామహులు' ధర్మవరం కృష్ణమాచార్యులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, కోలాచలం శ్రీనివాసరావు, తిరుపతి వేంకటకవులు ప్రభృతులు అధికభాగం పౌరాణిక, చారిత్రక నాటకాలు రచించారు. ఇవి అన్నీ విజయవంతంగా ప్రదర్శింపబడ్డాయి. క్రీ. శ. 19వ శతాబ్ది చివరిభాగంలో, వ్యావహారిక భాషలో రచింపబడిన ప్రఖ్యాత స్వతంత్ర సాంఘిక నాటకం గురజాడ వేంకట అప్పారావు రచించిన 'కన్యాశుల్కం'. శుల్కం పుచ్చుకొని, బాలికలను (కన్యలను) 50, 60 ఏండ్ల వృద్ధులకు భార్యలుగా అమ్మటం, వారు రజస్వలలు కాకుండానే ఆ వృద్ధులు గతించి. ఆ కన్యలు విధవలు కావటం అనే దురాచారాన్ని చిత్రించిన నాటకమిది. తెలుగులోని సాంఘిక నాటకాలకు ఇది తలమానికం అని చెప్పవచ్చు. క్రీ. శ. 20 వ శతాబ్దిలోని రెండవ దశాబ్దంలో ప్రసిద్ధికెక్కిన కొన్ని నాటక సంఘాలు: బెజవాడలోని మైలవరం కంపెనీ, ఏలూరులోని మోతేకంపెనీ,

రాజమండ్రిలోని గున్నేశ్వరరావు కంపెనీ, బందరులోని డి. వి. సుబ్బారావు కంపెనీ. గుంటూరు, తెనాలి మున్నగు పట్టాణాలలో కూడా ప్రసిద్ధాలైన వృత్తినాటక సంఘాలు ఉండేవి.

తెలుగు నాటకరంగ చరిత్రలో విశిష్టంగా పేర్కొన దగిన అంశాలలో 'సురభివంశం' ఒకటి. ఈ వంశంలో స్త్రీ పురుషు లందరూ నటన వృత్తిగా స్వీకరిస్తారు. ఈ వంశంవారు బహుళంగా వృద్ధిపొంది, ఇప్పుడు ముప్పదికి పైగా నాటక సమాజాలను నడుపు తున్నారు. వేర్వేరు సమాజాలను స్వతంత్రంగా నడుపుకొంటు న్నప్పటికీ వీరందరు ఒక సమాఖ్యగా ఏర్పడినారు. అవేటి నాగేశ్వరరావు ఈ సమాఖ్యకు నాయకుడు ; ఆయన స్వయంగా ఒక సురభి నాటక సమాజాన్ని నిర్వహిస్తూవున్నారు డైరెక్టరుగారు.

కోలాహలపూర్వకమైన నటనా విధానాన్ని తిరస్కరించి, సాత్త్వికాభినయానికి ప్రాధాన్యమిచ్చి బళ్ళారి రాఘవాచార్యులు ('రాఘవ' అనేది ప్రసిద్ధనామం) క్రీ.శ. 1930 ప్రాంతాలలో రంగ స్థల నటనంలో విప్లవం తీసికొనివచ్చారు. ఆయన తెలుగు నాటక రంగానికి చేసిన సేవ మరి ఏ ఒక్కరూ చేసివుండలేదు. నాడు ఆంధ్ర నాటకరంగం చాలా ఉత్సాహంతో పనిచేసింది. మంచి నాటకాలు ప్రయోగింపబడసాగాయి. యువతరంవారు కొత్త పంథాలో రచింపబడే ఆంగ్ల నాటకాలు పరిశీలించారు. మద్రాసు హైకోర్టు ప్రసిద్ధ మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన పి. వి. రాజ మన్నారు తమ 'తప్పెవరిది' రచనతో తెలుగులో కొత్త నాటక రచనా విధానానికి నాంది పలికారు. ముద్దుకృష్ణ, నార్ల, ఆత్రేయ, నరసరాజు, తిలక్ ప్రభృతులు కొందరు నాటక కర్తలుగా ప్రసిద్ధి పొందారు. ఆంధ్రదేశంలో నేడు బాగా ప్రచారంలో ఉన్న ఏకాంకికా నాటక రచనకు నార్ల మార్గదర్శకులు. యువతరంవారు నేడు ఆంగ్ల నాటకాలను అనుసరించటమేకాక, మంచి స్వతంత్ర నాట కాలను కూడ రచిస్తున్నారు. ఒకప్పుడు వృత్తి నాటకరంగం బాగా ప్రజాదరణ పొందింది. కాని సినిమా రాకవల్ల అది బాగా దెబ్బ తిన్నది. ఇటీవలికాలంలో సినీ కళాకారుడైన శ్రీ నాగభూషణం గారు 'రక్త కన్నీరు' నాటకాన్ని చాలా జయప్రదంగా ఆంధ్ర రాష్ట్రంలో అనేకచోట్ల ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందారు. నాటకాన్ని శ్రీ నాగభూషణంగారు ప్రజల దగ్గరకు తీసుకువెళ్లారంటే

అతిశయోక్తికాదు. తెలుగు నాటకరంగం పునర్వికాసం పొందితేనే కాని తెలుగులో ఉత్తమ నాటకాలు వెలువడవు.

క్రీ.శ. 1929లో స్థాపింపబడిన 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు' ఆధ్వర్యంలో ఔత్సాహిక నాటకరంగం అపారంగా అభివృద్ధి పొందింది. 'ది పీపుల్స్ థియేటర్', హైదరాబాదులోని 'నాట్య సంఘం', కొప్పరపు సుబ్బారావు స్థాపించిన 'లిటిల్ థియేటర్' మొదలైనవి ఔత్సాహిక నాటకరంగ సంస్థలే. ఆంధ్ర నాటక రంగంమీద సుప్రసిద్ధులైన నటులు ఎందరో ఉన్నారు— దుష్యంతుడుగా యడవల్లి సూర్యనారాయణ, హరిశ్చంద్రుడుగా హరిప్రసాదరావు, దుర్యోధనుడుగా మాధవపెద్ది వేంకట్రామయ్య, హరిశ్చంద్రుడుగా డి. వి. సుబ్బారావు, కృష్ణుడుగా బందా కనకలింగేశ్వరరావు, అర్జునుడుగా పులిపాటి వేంకటేశ్వర్లు, అనేక ముఖ్య పాత్రధారులుగా పీసపాటి, సూరిబాబు, రాఘవలు, స్త్రీ వేషధారులుగా ముప్పిడి జగ్గరాజు, పద్మశ్రీ స్థానం నరసింహారావు సుప్రసిద్ధులైనారు. వీరేకాక ప్రసిద్ధ నటులు ఇంకా చాలా మంది ఉన్నారు. నటీమణులలో శ్రీమతి పూర్ణిమ, శ్రీమతి రాజేశ్వరి వృత్తి నాటకరంగంమీద సుప్రసిద్ధులైనారు.

అబ్బూరి రామకృష్ణరావుగారు కన్యాశుల్కాన్ని చక్కగా సంక్షిప్తపరచి ఉత్తమ కళా ప్రమాణాలతో ఆంధ్రదేశమంతటా ప్రయోగించారు.

తెలుగులోకి ఇతర భారతీయ భాషలనుంచి నాటక సాహిత్యం అనూదితమౌతోంది. మరాఠీనుంచి శ్రీవిజయ మెండూల్కర్ రచన "శాంతత! కోర్ట్ చాలూ ఆహే!"ను శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి గారూ, తమిళం నుంచి ఇందిరా పార్థసారథి రచన "లేయర్స్ ఆఫ్ బ్లాంకెట్స్"ను శ్రీగోవిందరాజు రామకృష్ణారావుగారూ అనువదించారు. అలాగే ఆంగ్ల నాటక రచయిత షేక్స్పియర్ రచన "మెక్బెత్"ను శ్రీ అమరేంద్ర అనువదించారు. గ్రీక్ మహాకవి సోఫోక్లిస్ రచన "యాంటిగని" నేను అనువదించాను. ఇక్కడ స్థాలీపులాక న్యాయంగా కొన్ని రచనలనే పేర్కొనడం జరిగింది. ఈ అనువాదాలు తెలుగునాటక సాహిత్యానికి కొత్త స్ఫూర్తిని ఇవ్వగలవని ఆశించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో రవీంద్ర భారతి నిర్మాణం జరగడంతో రాజధానిలో నాటకకళకు కొత్త ఉత్తేజం

కలిగింది. ఎన్నో సాంకేతిక సౌకర్యాలున్న రవీంద్రభారతిలో నూతన ప్రయోగాలకు అంకురార్పణ జరిగింది. 'ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఇటీవలి కాలంలో నాటకరంగానికి ఎనలేని కృషి చేసింది. ప్రసిద్ధ నాటక రచయితల జీవిత సంగ్రహాలను ప్రకటిస్తోంది. "నాట్యకళ" మాసపత్రికను ప్రచురిస్తోంది. అనేక నాటక గోష్టి కార్యక్రమాలను నిర్వహించింది. 1973లో ఆరువారాలపాటు నాటక శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. ఇందులో నటభై ఐదు గురికి ఆహార్యం, రంగోద్దీపనం, నటన, వాచికం, దర్శకత్వం మొదలైన శాఖల్లో సమగ్రమయిన శిక్షణను ఏర్పాటుచేసింది. ఆంధ్ర దేశంలో ఇలాంటి శిక్షణాశిబిరం ఏర్పడడం ఇదే మొదటిసారి.

ఈ శిక్షణానంతరం శిక్షణపొందిన బృందం శ్రీ చాట్ల శ్రీరాములు గారి దర్శకత్వంలో అబ్బూరి గోపాలకృష్ణ రచించిన ఆధునిక యక్షగానం "త్రిజాకీయమదర్శనం" పన్నెండు ప్రదర్శనలను ఒక సంవత్సర కాలంలో ఇచ్చింది. ఇటీవలికాలంలో నూతన ప్రయోగంగా ఈ ప్రదర్శన పేరుపొందింది. దర్శకులు, నటీనటులు బాగా శ్రమించి ఈ ప్రదర్శనను తీర్చిదిద్దారు. దర్శకుడు శ్రీ చాట్ల శ్రీరాములు బ్రిటిష్ డ్రామాలీగ్‌లో శిక్షణపొంది వచ్చిన యువకుడు. బ్రిటిష్ డ్రామాలీగ్‌లో శిక్షణపొంది "ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్"కు కార్యదర్శి అయిన శ్రీ ఏ. ఆర్. కృష్ణ మరొక ప్రముఖుడు. ఈయన చాలాకాలం ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘానికీ, భారతీయ నాట్య సంఘానికీ కూడా కార్యదర్శిగా పనిచేశారు. ఈయన ఇటీవల భారత జాతీయ పోరాటకాలంలో రచితమైన శ్రీ ఉన్నవ వారి "మాలపల్లి" నవలను నాటకీకరించి పది పన్నెండు రంగస్థలాలపై ఏకకాలంలో నాటకాన్ని ప్రదర్శించి కొత్త ప్రయోగం చేశారు. ఇంకా నూతన ప్రయోగాలను చేస్తున్నవారిలో శ్రీ డీన్ బ్రదు, రావి చలం, ఈరంకి సీతారామయ్య ప్రముఖులు. తెలుగు నాటక రంగంమీద కొత్తగాలులు వీస్తున్నవనడానికి ఈ ప్రయోగాలే నిదర్శనం.

నాటకరంగానికి ప్రత్యక్షంగా సంబంధించి ఉండకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో రంగస్థలంమీద ప్రదర్శితమయ్యే కళారూపాలు కొన్ని ఉన్నాయి. వీటిలో బుర్రకథ, జముకులకథ మొదలైనవి ప్రసిద్ధాలు. ఈ ప్రక్రియలు చాలా ప్రాచీనకాలం నుంచే మనకు సంక్రమించాయి. నేడు ఈ ప్రక్రియలో విశేషమైన కృషి చేసిన

వారున్నారు. వారిలో ప్రజా నాట్యమండలికి చెందిన శ్రీ నాజర్, శ్రీ లక్ష్మీకాంత మోహన్ ముఖ్యులు. శ్రీ లక్ష్మీకాంత మోహన్ బుర్ర కథలనే కాక జానపద గేయాలనుగూడా శ్రావ్యంగా ఆలాపించ గల దిట్ట. షేక్స్‌పియర్ నాటకాలను అనువదించడమేకాక, ఆంగ్లంలో షేక్స్‌పియర్ నాటక సాహిత్యంమీద విమర్శకూడా ప్రక టించారు.

నాటకరంగానికి చెందని మరొక ప్రక్రియ ధ్వన్యనుకరణం. శ్రీ నేరెళ్ళ వేణుమాధవ్ ఈ కళలో నిష్ణాతులు. అసలు ఆంధ్ర దేశంలో ఈ విద్యకి కళాగౌరవాన్ని సంతరించిన వ్యక్తి యీయన. రకరకాల కంఠస్వరాలనూ, వివిధ వాద్య స్వరాలనూ పలికించ డంలో ఈయనకి ఈయనే సాటి. ఇటీవలే అమెరికా మొదలైన విదే శాలు పర్యటించి ఐక్యరాజ్య సమితిలో తన విద్యని ప్రదర్శించి అక్కడి వారిచే అశేష గౌరవాలను పొందిన ఘనులు వీరు.

సినిమా :

తెలుగు సినిమారంగం ఈనాడు మనదేశంలో హిందీ సినిమా రంగం తరవాత ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించింది. మొట్ట మొదటగా తెలుగులో 1931 లో శ్రీ హెచ్.యం. రెడ్డిగారు "భక్త ప్రహ్లాద" చిత్రం నిర్మించారు. ఆనాటినుంచీ ఈనాటివరకూ ఎంతో మంది ప్రతిభావంతులు సినిమారంగాన్ని బహుముఖాల అభివృద్ధి చేశారు. కాంచనమాల, పుష్పవల్లి, కన్నాంబ, భానుమతి, నాగయ్య, నారాయణరావు, గోవిందరాజుల సుబ్బారావు మొదలైనవారు నటీ నటులుగా రాణించారు. శ్రీ సి. పుల్లయ్య, బి. యన్. రెడ్డి, ఘంటసాల బలరామయ్య, గూడవల్లి రామబ్రహ్మం, మీర్జాపూర్ రాజా మొదలైన వారెందరో దర్శకులుగా తమ ప్రతిభను ప్రక టించారు. తెలుగు చిత్ర నిర్మాణం పౌరాణిక చిత్రాలతో ప్రారంభ మైంది. మొదటి సాంఘిక చిత్రం "ప్రేమ విజయం" 1936 లో నిర్మించబడింది. సాంఘిక సమస్యల గురించీ సంఘసంస్కరణ గురించీ నిర్మించిన చిత్రాలు సుమంగళి. గృహలక్ష్మి, మాలపిల్ల, రైతుబిడ్డ ఉత్తమ కళాఖండాలు. బి.యన్. రెడ్డిగారి "మల్లీశ్వరి" చరిత్రాత్మక చిత్రం.

శ్రీ యన్.టి. రామారావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు చిత్ర రంగానికి మకుటాలు లేని మహారాజులుగా వెలుగొందుతున్నారు.

సినిమా రచనలో సముద్రాల, పింగళి, మల్లాది కృష్ణశాస్త్రి, నారాయణరెడ్డి, దాశరథి,. శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర ప్రభృతులు పేరుపొందిన మేటి రచయితలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనేక విధాలుగా రాష్ట్రంలోని సినిమా పరిశ్రమకు సహాయ పడుతోంది.

విగ్రహశిల్పం :

చిత్రలేఖనం, విగ్రహశిల్పం, వాస్తుకళ—వీటిల్లో ఆంధ్రుల దెప్పుడూ ప్రముఖ స్థానమే. ఆంధ్రుల చరిత్రను వివరించే సమయంలో ఆంధ్రుల వాస్తుకళను గూర్చి సంక్షిప్తంగా వివరించి ఉన్నాను. భారతీయ సంప్రదాయంలోనే కాక ఆంధ్ర సంప్ర దాయంలోకూడా విగ్రహశిల్పానికి, వాస్తుకళకు సన్నిహిత సంబంధం ఉంది. రాతి దేవాలయాలలో శిల్పాలు మలచటం జరిగింది. మెత్తని రాళ్ళమీద శిల్పాలు చెక్కి బౌద్ధ స్తూపాలకు చుట్టూ అమర్చేవారు. దేవాలయ గోపురాలు కూడా శిల్పాలకు చక్కని అవకాశం కల్పించాయి. విజయనగర సామ్రాజ్యంనాటి రాజ భవనాలలోను, పెద్ద పెద్ద శాలలలోను శిల్ప విన్యాసాలు కన్పట్ట గలవు. ఆంధ్రుల చరిత్రలోని శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండి, పల్లవ, చాళుక్య, కాకతీయ, విజయనగర రాజుల కాలాల్లో వాస్తు కళతోపాటు విగ్రహశిల్పం కూడా అభివృద్ధి పొందింది. లభించిన విధంగా భద్రపరుపబడిన ఈ శిల్పాలన్నింటిని ఆయా ప్రాంతాలలో కాని, పురావస్తు ప్రదర్శనశాలల్లో కాని నేటికిని చూడవచ్చు. భారతీయ ప్రభుత్వమేకాక ఆంధ్ర ప్రభుత్వం కూడా ఈ పురాతన కట్టడాలను భద్రపరచడానికి చాలా జాగ్రత్త తీసికొంటున్నది.

అమరావతి, నాగార్జున కొండ స్తూపాల చుట్టూ చలువరాళ్ళలో మలచబడిన జాతక కథల శిల్పాలే మనకు లభించిన తొలిశిల్పాలు. గౌతమ బుద్ధుని వివిధ జన్మలకు సంబంధించిన కథలను కళాత్మ కంగా, విశదంగా ఈ శిల్పాలు నిరూపిస్తున్నాయి. ఆ విగ్రహాల ముఖభావాలు, కదలికలు, వివిధ అంగవిన్యాసాలు సజీవ వ్యక్తుల వలెనే బుద్ధుని ఆశయాలను, కథలను, బోధలను వ్యక్తం చేస్తున్నాయి. సాంచిలోని ప్రసిద్ధ తోరణం, మహాబలిపురంలోని అర్జున తపస్సు, లేపాక్షిలోని మహానంది, రామప్ప గుడిలోని నృత్య భంగిమలు, హంపిలోని నృసింహమూర్తి—ఇవి ఆంధ్రుల ప్రసిద్ధ

శిల్పాలిలోని కొన్ని మాత్రమే. ప్రాచీన సంప్రదాయానికి చెందిన కొలదిమంది శిల్పులు మాత్రం నేటికీ మినుకు మినుకు మంటూ జీవించి ఉన్నప్పటికీ బౌద్ధ హైందవశిల్ప సంప్రదాయాలు నశించి పోయాయనే చెప్పవచ్చు; ఇది మన దురదృష్టం. ఈ విధంగా ఈ కళను నశించి పోనీయరాదు.

శిల్పాలు అంటే, పాశ్చాత్య మతం ప్రకారం, వ్యక్తుల విగ్రహాలు లేదా సామూహిక చిత్రణం. ఈ ఆధునిక శిల్పంకూడా నేటి ఆంధ్రులలో ప్రచారం పొందలేదు. యువతరానికి చెందిన వర్ధిష్ణువులైన శిల్పులు కొందరు ఇప్పుడిప్పుడు అభివృద్ధిపథంలో ప్రయాణిస్తున్నారు. కాని దేవీప్రసాదరాయ్ చౌదురివలె ప్రఖ్యాతి పొందినవారు ఆంధ్రులలో ఇంకా ఎవ్వరూ లేరు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉస్మాన్‌సిద్దికీ మంచిశిల్పి.

దక్కన్‌లో ముస్లిం పరిపాలన ఆరంభమైన పిమ్మట వాస్తు కళ వికసించిందని చెప్పవచ్చు. కుతుబ్‌షాహీల పరిపాలనలో గోల్కొండలోను, అసఫ్ జాహీల పరిపాలనలో హైదరాబాదులోను వాస్తుకళ వికాసం పొందింది. నాటి నిర్మాణాలైన చార్‌మినార్, మక్కామసీదు, కుతుబ్‌షాహీల గోరీలు మున్నగునవి నేటికీ భద్రంగా కాపాడబడటం మనం చూస్తున్నాము. ఆంధ్రలో, వాస్తుకళా విషయంలో, బ్రిటిష్‌వారు ఎట్టి కృషి చేయలేదు. పబ్లిక్ వర్క్స్ శాఖద్వారా బ్రిటిషు ప్రభుత్వం కొనసాగించిన వాస్తు నిర్మాణ శైలియే దురదృష్టవశాత్తు ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. పాశ్చాత్య శిల్పుల, వారి శిష్యుల ప్రభావంవల్ల ఈ పరిస్థితిలో క్రమంగా మార్పు వస్తోంది. న్యూఢిల్లీ, చండీఘర్‌లలోని నూతన నిర్మాణాలను, దేశంలోని ముఖ్య పట్టణాలలోని కొందరు వ్యక్తుల సొంత భవనాలను చూస్తే ఈ విషయం స్పష్టం కాగలదు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని నిర్మించిన నవాబ్ అలీ నవాబ్ జంగ్ ప్రసిద్ధ వాస్తుశిల్పి. ఇటీవల ప్రభుత్వ వాస్తుశిల్పి పదవి విరమణ చేసిన ఫైజుద్దీన్ హైదరాబాదులోని రవీంద్రభారతీ నిర్మాణాన్ని రూపొందించారు. ఆంధ్రుల జాతీయ నాటకశాల అయిన ఈ 'రవీంద్ర భారతి' హైదరాబాదులో ఇటీవల నిర్మింపబడిన వాస్తు కళాత్మకమైన కట్టడం.

నేడు పలువురు యువకులు వాస్తుకళలో శిక్షణ పొందుచుండుట సంతోషకరమైన విషయం. హైదరాబాదులోని 'ఆర్టు

స్కూలు'లో ముప్పది మందికి పైగా బాలికలు వాస్తుకళ నేర్చు కొంటున్నారు.

చిత్రలేఖనం :

చిత్రలేఖన కళలో ఆంధ్రులు రమణీయమైన కృషి చేశారు. సాటిలేని సౌందర్యంతో కూడుకొన్న అజంతా బౌద్ధ చిత్రాలు ప్రాచీన శిల్పశాస్త్ర సమ్మతంగా కడుసమర్థతో చిత్రింపబడినాయి. అజంతా, బాగ్, సిత్తన్‌వాసల్, సిగీరియాలలోని 'ఫ్రిస్కో' చిత్రాలకు కళాత్మ కంగా సన్నిహిత సంబంధం ఉంది. అజంతా చిత్రాలు శాతవాహన, వాకాటక, బాదామి చాళుక్యుల కాలాల్లో చిత్రింపబడ్డాయి. తరువాతి కాలంలో కూడా చిత్రలేఖన కళ బాగా కొనసాగుతూనే వచ్చింది.

కాకతీయ యుగానికి చెందిన చిత్రాలు దురదృష్టవశాత్తూ లభించకపోయినా, ఆనాటి చిత్రలేఖనా శైలిని అర్థం చేసుకోవ డానికి రాచకొండలో కొద్దిగా మిగిలి ఉన్న చిత్రఖండం ఉపక రిస్తుంది. ఈ చిత్రఖండం రేచెర్ల వెలమనాయకులు రాచకొండను రాజధానిగా చేసుకొని పాలించిన కాలం నాటిది. ఈ చిత్రఖండం ఎల్లోరాలోని ఇంద్రసభ చిత్రాలను కొంతవరకు పోలిఉన్నది. మనకు తెలిసినంతలో ఆంధ్రదేశంలో లభించిన అతిపురాతన చిత్రం ఇదే.

విజయనగర సామ్రాజ్య కాలానికి చెందిన లేపాక్షి చిత్రాలు జగత్ ప్రసిద్ధిని పొందాయి. లేపాక్షి చిత్రాలకు సమకాలీనాలయిన చిప్పగిరి చిత్రాలు గూడా విజయనగర శైలికి మంచి ఉదాహరణలే. విజయనగర సామ్రాజ్యపు తుది దినాలకు చెందిన సోమపాలెం చిత్రాలు చాలావరకు కాల ప్రభావానికిలోనై నశించినా, ఇంకా ఉన్న చిత్రాలు అత్యంత మనోహరమైనవి. రేఖలోని లాలిత్యం మనలను ముగ్ధులను చేస్తుంది.

మాచెర్ల, కాళహస్తి, పిల్లలమఱ్ఱి దేవాలయాలలోని చిత్రాలు విజయనగర చిత్రలేఖనపు క్షీణదశను సూచిస్తాయి. వీటిలో కాళహస్తి దేవాలయంలోని చిత్రాలు కలంకారీ చిత్రశైలిలో చిత్రిత మైనాయి.

కాగా, ఆంధ్రదేశంలో హిందూపరిపాలన లో 'ఫ్రిస్కో'

చిత్రాల సంప్రదాయం నిరంతరంగా సాగింది. గోల్కొండలో ఇస్లాం రాజ్యం ఏర్పడిన పిమ్మట ఆంధ్ర చిత్రకారులు మొగల్ శైలి చిత్రలేఖనం చేపట్టారు. ఈ శైలి, అత్యంత మనోహరమైన 'దక్కన్ స్కూల్ ఆఫ్ మినియేచర్ పెయింటింగ్'గా అభివృద్ధి పొందింది. బ్రిటిష్‌వారి పాలనలో ఆంధ్రదేశంలో చిత్రలేఖన కళకు కూడా ఎట్టి దోహదం కలుగ లేదు. బెంగాలులో అవనీంద్రనాథ టాగూర్ స్థాపించిన వంగ సంప్రదాయపు ప్రభావం పడేవరకు ఆంధ్రదేశంలో చెప్పుకొనతగిన కృషి ఏమీ జరుగలేదు.

ఆధునిక కాలంలో ఆంధ్ర చిత్రలేఖనానికి మార్గదర్శకులు దామెర్ల రామారావు, అడివి బాపిరాజు. రామారావు బొంబాయి కళాశాలలో శిక్షణ పొందారు. ఆయన అజంతా చిత్రాలనుండి ఉత్సాహం పొంది, స్వీయ ప్రతిభకు తగిన ఒక క్రొత్త శైలిని రూపొందించుకొన్నారు. ఆయన చిత్రాలలోని రేఖా విన్యాసం, సమీకరణంలోని చిత్రణంలోని పొందిక, వర్ణసారళ్యం చాలా గణనీయాలు, గుణాధికాలు. బాపిరాజు ఎంత గొప్పచిత్రకారుడో అంత గొప్పకవి, నవలాకారుడు, పత్రికారచయిత. నా దృష్టిలో అయితే బాపిరాజు ప్రప్రథమంగా కాల్పనికోద్యమానికి చెందిన ఉత్తమ కళాకారుడు. వంగసంప్రదాయానికి చెందిన ప్రమోద్ కుమార్ ఛటర్జీనుండి ఉత్సాహం, ఆయనకడ శిక్షణ పొందారు బాపిరాజు. బాపిరాజు చిత్రాలన్నీ ప్రత్యేకమైన స్వీయముద్ర కలవి. ఆయన రేఖావిన్యాసంలో కోమలత్వం, భావప్రకటన సామర్థ్యం, క్రియాత్మకశక్తి ఉన్నాయి. కాని, ఆయన బహుముఖప్రజ్ఞకలవాడై, అనేక వ్యాసంగాలలో అభిరుచికలవాడై ఉండటంవల్ల ఎక్కువ చిత్రాలను రచింపకపోవటం మన దురదృష్టం.

చామకూర్, నాగేశ్వరరావులు వ్యక్తి చిత్రణంలో సిద్ధ హస్తులు. రామమోహనశాస్త్రి తైలవర్ణ, జలవర్ణ చిత్రలేఖనాలు రెండింటిలోను సిద్ధహస్తులు. బహుశా ఇంగ్లండులో శిక్షణ పొందిన తొలి ఆంధ్రచిత్రకారుడు ఈయనే. భాగీరథి జానపద చిత్రణంలో ప్రసిద్ధులు. హైదరాబాదులో ఖాన్‌బహదూర్ సయీద్ అహ్మద్, జలాలుద్దీన్‌లు ప్రసిద్ధ చిత్రకారులు. అజంతా చిత్రాలను యథా తథంగా చిత్రించటం మూలంగా వారు చిత్రలేఖన కళకు అమూల్య మైన సేవ చేశారు. యువతరంవారిలో పైడిరాజు, హెచ్.వి. రామ గోపాల్, మొక్కపాటి శ్రీనివాసులు, పి. టి. రెడ్డి, ఎస్. వి. రామా రావు, కృష్ణారెడ్డి, రెడ్డప్పనాయుడు, మధుసూదన్, జగదీశ్‌మిత్తల్,

శ్రీరావు, శ్రీమతి కరుణారావు, కుమారిల స్వామి, సయీద్ మాసూద్ అహ్మద్, కొండపల్లి శేషగిరిరావు, విద్యాభూషణ్, కుమారి ఫాతిమా అహ్మద్‌లు ముఖ్యంగా పేర్కొనదగ్గవారు. వీరిలో శ్రీ కృష్ణారెడ్డి పారిస్‌నగరంలో స్థిరపడ్డారు. ఈయన "ఎచింగ్"లో నిష్ణాతులు, ప్రపంచమంతటా ఈయనపేరు విఖ్యాతమైంది. శ్రీ ఎస్.వి. రామారావు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. అనేక అంతర్జాతీయ బహుమతులుపొందిన వీరు, విశ్వవిఖ్యాత కళావిమర్శకులు శ్రీ హెర్బర్ట్ రీడ్ ప్రశంసలనుపొందిన ఘనుడు. వర్ధిష్ణువులైన చిత్రకారులు ఇంకా ఎంతమందో ఉన్నారు. హైదరాబాదులో శక్తిమంతులైన చిత్రకారులు, యువతీయువకులు పలువురున్నారు. ఆంధ్ర చిత్రకారులు ప్రాచీన, నవీన సంప్రదాయాలు రెండింటిని ఆదరిస్తారు. వారు ఉత్సాహవంతులేకాక నిజమైన కళోపాసకులు. త్వరలోనే భారతీయ చిత్రకళకు గొప్ప విశిష్టతను చేకూర్చగల చిత్రకారులు ఆంధ్రప్రదేశ్‌లో వెలయగలరని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను.

చేతిపనులు :

ఆంధ్రప్రదేశ్‌లో అందమైన వస్తువులు కొన్ని సంప్రదాయ సిద్ధంగా చేతిపనులద్వారా తయారు అవుతున్నాయి. కళాభిమానులందరు తప్పక సంపాదించి భద్రపరచుకోవలసిన వస్తువులివి. బిద్రీ వస్తువులు, నిర్మల్ వస్తువులు, దంతంతో, కొమ్ముతో తయారు చేయబడిన వస్తువులు, వెండినగిషీ వస్తువులు, కొండపల్లి బొమ్మలు, తిరుపతి ఎఱ్ఱచందనం బొమ్మలు, చర్మ వస్తువులు, తివాసీలు, దుప్పట్లు, చాపలు, పేము వస్తువులు—ఇవి అన్నీ చేతిపనులవల్ల తయారవుతున్న వస్తువులే. ఆంధ్రప్రదేశ్ 'చేనేతవస్త్రాలకు కూడా ప్రసిద్ధికెక్కింది. గద్వాల్, సిద్ధిపేట, పోచంపల్లి, ఉప్పాడ, వెంకటగిరి చీరలు, ఆర్మూర్ సిల్కువస్త్రాలు, హిమురూ గద్వాల్ చోళ్ఖాన్‌లు, పొందూరు సన్నబట్టలు, కలంకారీ అద్దకాలు—ఇవి అన్నీ హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విక్రయశాలలో లభిస్తున్నాయి.

జానపద వినోదాలు :

'జనపద'మంటే పల్లెటూరు. జనపదాలలో ఉండేవారు జానపదులు. ఈ జానపదుల వినోదాలలో నృత్య, సంగీత,

నాటకాలేకాక, ఇంకా అనేకం ఉన్నాయి—తోలుబొమ్మలాటలు, కట్టెబొమ్మలాటలు, పగటివేషాలు, బుట్టబొమ్మలు, విప్రవినోదం, పులివేషాలు మొదలైనవి. తుమ్మెదపాటలు మొదలైనవి జానపద సంగీతానికి సంబంధించినవి. హరికథలు, బుర్రకథలు, భజనలు, బతకమ్మపాట మొదలైనవి నృత్య సంగీతాలు రెండింటికీ చెందుతాయి. కురవంజి, యక్షగానం, వీధి భాగవతం నాటకానికి చెందుతాయి. ఇవేకాక పర్వత, అరణ్యప్రాంతాలకు చెందిన చెంచులు, భిల్లులు, లంబాడీలు, కోయలు మున్నగువారి నృత్య వినోదాలు అనేకం ఉన్నాయి. ఈ జానపద వినోదాలకు ఉపయోగపడే గేయాలు నాగరక చిత్ర కల్పనలకు దూరమై, సుఖదుఃఖాలను స్వయంగా అనుభవించిన జానపదకవుల హృదయాలనుండి సూటిగా వెలువడినవి; ఇవి తెలుగులోని లలిత లేదా మధుర సాహిత్యానికి ప్రథమోదాహరణాలు. పండుగపబ్బాల సమయాల్లో, ఉత్సాహంతో స్త్రీపురుషు లందరూ సామూహికంగా తమతమ ఆచార సంప్రదాయాల్ని అనుసరించి ఈ వినోదాల్లో పాల్గొంటారు.

జానపద సాహిత్యం తెలుగులో అనంతంగా ఉంది. ఈ రంగంలో కృషిచేసిన ప్రముఖులు శ్రీ నేదునూరి గంగాధరంగారు. వీరు ఎన్నో జానపదగేయాలను సేకరించి ప్రచురించారు. ఇలాగే డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ తూమాటి దొణప్ప, శ్రీహరి ఆదిశేషుగార్లు ఈ రంగంలో కృషిచేసి ఎన్నో వ్యాసాలను ప్రకటించారు.

ఈ వినోదాలు నేడు నశించిపోతున్నాయి. పోగా మిగిలినవాటికి నాగరకత ప్రభావం సోకి, వాటిలోని సహజ ప్రాకృతిక సౌందర్యం లోపిస్తోంది. వీటిని పునరుజ్జీవింపజేయటానికి కృషి జరగాలి. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవంలో న్యూఢిల్లీలో అఖిల భారతీయ జానపద నృత్య సంగీతాలను ప్రదర్శింపజేస్తున్నారు. ఆ విధంగానే, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర జానపద సంగీత నృత్యాదులను ప్రదర్శింపజేయవచ్చు.

విశ్వవిద్యాలయాలు :

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఐదు విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నాయి. కేంద్ర విశ్వవిద్యాలయం కూడా ప్రారంభం అవు

తుంది. ఆంధ్రప్రదేశ్‌వంటి సువిశాలమైన రాష్ట్రానికి విద్యావసరాలకు ఈ విశ్వవిద్యాలయాలు సహాయపడుతున్నాయి. వీటిలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు మిగిలిన విశ్వవిద్యాలయాలకన్నా ముందుగా స్థాపించబడింది. తెలుగుజిల్లాల కొక విశ్వవిద్యాలయ ముండాలనీ, తెలుగు భాషాభివృద్ధికీ సంస్కృతి పరిరక్షణకు ఇది అవసరమనీ అర్ధశతాబ్దం కింద మేధావులు కొందరు భావించినందు వల్లనూ, వారి కృషివల్లనూ ఆంధ్ర విశ్వకళాపరిషత్తు యేర్పడింది. డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి, పానగల్లు మహారాజాల కృషితో ఈ విశ్వకళాపరిషత్తు శాస్త్రీయ విధానంలో రూపొందించబడింది. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వి. యస్. కృష్ణ వంటి ప్రసిద్ధ పురుషులు ఈ విశ్వకళాపరిషత్తుకు ఉపాధ్యక్షులుగా పని చేశారు. విజ్ఞానశాస్త్ర రంగంలో ఈ విశ్వకళాపరిషత్తు ఎంతో అభివృద్ధిని సాధించింది.

నైజాం నవాబు వితరణవల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం రూపుదాల్చింది. ఆధునిక విజ్ఞానాన్ని ఆనాటి హైదరాబాదు సంస్థాన రాజభాష అయిన ఉర్దూలోనే బోధించబడింది. ఈ విశ్వవిద్యాలయం ఉర్దూలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేసింది. ఈ విశ్వవిద్యాలయానికి నవాబ్ ఆలీయావర్ జంగ్, డాక్టర్ భగవంతం, డాక్టర్ డి. యస్. రెడ్డి ప్రభృతులు ఉపాధ్యక్షులుగా పనిచేసి అభివృద్ధిలోనికి తెచ్చారు.

శ్రీ తిరుపతి వేంకటేశ్వర దేవస్థానంవారి విరాళంతో తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యేర్పడింది. రాయలసీమ ప్రాంతాలకు ఈ విశ్వవిద్యాలయం ఎనలేని సేవ చేస్తోంది. శ్రీ గోవిందరాజులు నాయుడు వంటి మేధావులైన ఉపాధ్యక్షుల నేతృత్వంలో ఈ విశ్వవిద్యాలయం ఎంతో ప్రగతిని సాధించింది.

హైదరాబాదులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం, సాంకేతిక విశ్వవిద్యాలయం కూడా ఎంతో గర్వించదగ్గ కృషిని చేస్తున్నాయి.

పరిశోధనలు :

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట, అంతకంటె అధికంగా తొలుత ఆంధ్ర రాష్ట్రం, తరువాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన పిమ్మట తెలుగు దేశంలో వివిధ రంగాలలో పరిశోధనాసక్తి

పెంపొందింది. రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు ఇందులకు ఎంతగానో దోహదం చేశాయి ; చేస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో, సంగీత నృత్య నాటకాది కళలలో పరిశోధనలు జరుగుతున్నాయి. షలువురు నన్నయ తిక్కనాది కవులపై, చరిత్రపై, చిత్రలేఖనాది లలిత కళలపై, నవలలు, నాటకాలు, నవ్య కవితలపై, నృత్య సంగీతాలపై, జానపద వినోదాలపై, చేతి పనులపై, చక్కని పరిశోధనలు కావించి, గ్రంథాలు రచిస్తున్నారు ; డాక్టరేటు డిగ్రీలు పొందుతున్నారు. డిగ్రీ సంపాదనతో నిమిత్తం లేకుండా మరి కొందరు జిజ్ఞాసువులు స్వయంగా పరిశోధనలు సాగించి, ఫలితాలను గ్రంథ రూపంలో అందిస్తున్నారు. భరతముని నాట్య శాస్త్రం సమగ్రానువాదం పొందింది తొలుత తెలుగు భాషలోనే. ఇట్టి పరిశోధనలన్నీ ప్రాచీన, నవీన సంప్రదాయాలు రెండింటికి మధ్య సేతువుగా నిల్చి, జాతి చైతన్యాన్ని జాగరితం చేస్తాయి. పై పరిశోధన గ్రంథాలలో ఇప్పటికి కొన్ని మాత్రమే ముద్రణ భాగ్యం పొందాయి. తక్కినవి కూడా ముద్రణ భాగ్యం పొంది, ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడు భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి అవి ఎంతగానో ఉపకరిస్తాయి.

అకాడమీలు :

ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన పిమ్మట, సాంస్కృతిక పునర్వికాసం కలిగించాలన్న ఆశయంతో లలిత కళలకు—సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, పురావస్తు సంచయం—వీటికి ప్రోత్సాహ సహకారాలివ్వటం కోసం ప్రభుత్వం చేయగలినదంతా చేస్తోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పుడు సాహిత్య అకాడమి, సంగీత నాటక అకాడమి, లలితకళా అకాడమి, పురావస్తు పరిశోధనశాఖ, జాతీయ నాటకశాల అయిన రవీంద్రభారతి ఉన్నాయి ; మూడు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలు, రెండు ప్రైవేటు నాటక విద్యాలయాలు ఉన్నాయి. కూచిపూడి గ్రామంలో కూచిపూడి నృత్యశిక్షణ కేంద్రం నెలకొల్పబడింది. హైదరాబాదులో వాస్తుకళ, లలితకళల ప్రభుత్వ కళాశాల ఉంది. రెండు పురావస్తు ప్రదర్శన శాలలు—ఒకటి హైదరాబాదులో, ఇంకొకటి విజయవాడలో – ఏర్పాటు చేయబడినాయి. ఇవికాక, హైదరాబాదులో సుప్రసిద్ధమైన 'సాలార్ జంగ్ మ్యూజియం' ఉంది.

శ్రీ బి. రామకృష్ణరాజుగారూ, శ్రీ పసల సూర్యచంద్రరావు

గారూ, సంగీత నాటక అకాడమీ ద్వారా సంగీత, నాటక కళలకు ఎనలేని సేవ చేశారు. సంగీత నాటక అకాడమీ ద్వారా ఎన్నో విలువైన గ్రంథాలను ప్రచురించారు.

శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారూ, శ్రీ ఎల్. ఎన్. గుప్తాగారూ చాలా కాలం ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీకి సారథ్యం. వహించి చిత్ర శిల్ప కళలకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చారు.

సాహిత్య అకాడమీ ఎన్నో విలువైన గ్రంథాలను ప్రచురించి భాషా సేవ చేసింది. భాషా విషయిక పరిశోధనలలో సహాయ కారులుగా ఉండే ఎన్నో గ్రంథాలను ప్రచురించడం సామాన్యం కాదు. సాహిత్య అకాడమీ నెరపుతున్న కృషికి అధ్యక్షులు డా. బెజవాడ గోపాలరెడ్డి, కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు గారలు ప్రధానులూ, ప్రశంసనీయులూను. రాష్ట్రంలోని సైన్సు అకాడమీ విజ్ఞాన ప్రసారానికి ఎంతో కృషి చేస్తున్నది. తెలుగుఅకాడమీ పాఠ్య గ్రంథాలను తయారు చెయించి ప్రచురించడమేకాక, భాషా విషయంలో అమూల్యమైన పరిశోధనలను కూడా చేస్తోంది.

అకాడమీలన్నీ తమ తమ రంగాలకు సంబంధించిన సంస్థలకు తగిన చేయూత నివ్వటానికీ, పరిశోధనలను ప్రోత్సహించటానికీ కృషి చేస్తున్నాయి. పేదవారైన వృద్ధ కళాకారులకు ఉచిత వేతనాలివ్వటం జరుగుతోంది. రవీంద్రభారతి నిర్మాణానికి పూర్వం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ నాటకశాల లేదు. ఇప్పుడు ఆ కొరత తీరింది. ఇదేవిధంగా జిల్లా కేంద్రాలలో, మునిసిపాలిటీలలో జాతీయ నాటకశాలలు నిర్మించటానికి కృషి సాగుతోంది. క్రమంగా ఆంధ్రులు ఉన్న కొలది సాధనాలతో, అవకాశాలతో, ధైర్యంగా, దృఢ సంకల్పంతో, ఆశతో, అమోఘమైన సాంస్కృతిక పునరుజ్జీవనం సాధించగలమన్న ఆత్మప్రత్యయంతో అభివృద్ధి పథంలో పురోగమిస్తున్నారు.

పత్రికా రంగం :

ఆంధ్రప్రదేశ్‌లో పత్రికారంగం దేశంలోని యే రాష్ట్రంలోని పత్రికారంగానికీ తీసిపోనిది. ఎంతోమంది పత్రికా రచయితలు ఆంధ్రప్రదేశ్‌లో తమ విద్యకు శ్రీకారం చుట్టిన తరవాత యావద్భారతదేశ ఖ్యాతిని సముపార్జించారు. తెలుగులో కేవలం దిన పత్రికలూ, వార, మాస, పత్రికలేకాక, పరిశోధనలకు అంకితమైన పత్రికలూ స్థాపించబడినై. ఆంధ్ర పత్రికని దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావుగారు ప్రారంభించి తెలుగులో దిన పత్రిక స్థాపనలో ప్రథములైనారు. ముట్నూరి కృష్ణారావుగారు కృష్ణా పత్రికను స్థాపించి ఆంధ్ర సాంస్కృతిక రంగానికి యెంతో సేవ చేశారు. డాక్టర్ పట్టాభి, టంగుటూరి ప్రకాశం, మాడపాటి హనుమంతరావు వంటి నాయకులు అటు రాజకీయాలలోనేకాక పత్రికా రచనలో గూడా విఖ్యాతులైనారు. కేవలం సారస్వత పరిశోధనలకు అంకితమైన పత్రికలలో శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారి, అముద్రిత గ్రంథ చింతామణి చెప్పుకోదగ్గది. కోటంరాజు పున్నయ్య, కోటంరాజు రామారావు, ఖాసా సుబ్బారావు ప్రభృతులు ఆంగ్ల పత్రికా రచనలో యావద్భారత ఖ్యాతిని పొందారు. తెలంగాణా ప్రాంతంలో శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు చాలాకాలం గోలకొండ పత్రికను ప్రచురించి ఆ ప్రాంతంలో రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి కారకులైనారు. ఉర్దూ పత్రికా రచయిత శ్రీ షోయి బుల్లాఖాన్ తాను నమ్మిన భారత జాతీయ వాదం కోసం కలంతో పోరాడి చివరకు ప్రాణాలు సైతం కోల్పోయిన ధీశాలి. ఈ నాటికీ పత్రికా రచనను సాగిస్తున్న శ్రీ చలపతిరావు, శ్రీ నార్ల వెంకటేశ్వరరావు, శ్రీ గోరా శాస్త్రి, శ్రీ జి. కె. రెడ్డి గారలు యే దేశానికైనా వన్నె తెగలిగిన మేధావులు.

దేశ పునరుజ్జీవనానికి గ్రంథాలయా లెంత అవసరమో చెప్ప నవసరంలేదు. ఈ రంగంలోకూడా ఆంధ్ర ప్రదేశ్ ముందంజ వేసిందనే చెప్పాలి. ఈనాడు ఊరూరా గ్రంథాలయాలు వెలసిన వంటే కారణం శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారూ, పాతూరి నాగభూషణంగారూ శక్తివంచన లేకుండా చేసిన కృషే కారణం. గ్రంథాలయ ప్రచారాన్ని ఒక ఉద్యమంగా నడిపిన ఘనత వీరికి చెందుతుంది.

కళల పరమార్థం :

కళ ద్వారా పరిపూర్ణత్వం సాధించాలన్నదే పరమాశయం. మానవులు కళ ద్వారానే సౌందర్యాన్ని గ్రహించ గలరు. సౌందర్యాన్ని గ్రహించి, అనుభవించటం ద్వారానే ఆనందం—అంటే, సుఖ దుఃఖాతీతమైన, అపారమైన, నిశ్చలమైన శాంతి లభ్యమవుతుంది. అప్పుడే మానవుడు స్వయంభువుగా, ఆత్మజ్ఞానిగా, సత్య స్వరూపుడుగా, అంటే—సత్, చిత్ స్వరూపుడుగా—వెలయగలడు.

ఆంధ్ర భాషా సాహిత్యాలు–ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆచార్య తూమాటి దొణప్ప
ఆంధ్రశాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం

సుసంపన్నమైన ఆంధ్ర సాహితీ సంప్రదాయం ప్రధానంగా ప్రాంతీయ ప్రభువుల ఆదరాభిమానాలపై ఆధారపడి వృద్ధి చెందింది. బ్రిటిష్ పాలన కాలంలో మొదట చిన్నచిన్న రాజ్యాలు గానూ, తరువాత చిన్న చిన్న భూస్వామ్యాలుగానూ మారిపోయినప్పటికీ, ఆంధ్రదేశంలోని కొన్ని రాజకుటుంబాలవారు తరతరాలుగా వచ్చిన తమ సాహితీ పోషణ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. ఇరవయ్యో శతాబ్ది తొలినాళ్లదాకా, కొద్దిగానో గొప్పగానో ఇది కొనసాగుతూనే వచ్చింది. ఆ రోజుల్లో ఆంధ్రులు సమష్టి మద్రాసు రాష్ట్రంలో పౌరులుగా వుంటూ, ఒక భాషా వర్గంగా తమ వెనుకబాటుతనాన్ని అప్పుడప్పుడే గుర్తిస్తున్నారు. తమ భాష పట్ల అభిమానం, తమ ప్రాచీన సంస్కృతిని గురించిన గర్వం ఆంధ్రులలో అప్పుడప్పుడే పాదుకోజొచ్చాయి. పూర్వాంధ్ర రాజుల కీర్తి ప్రతిష్ఠలను గురించీ, బలపరాక్రమాలను గురించీ, ఆంధ్ర సాహిత్య స్వర్ణయుగాన్ని గురించీ కవులు గానం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆందోళన ఆకృతి తీర్చుకొంటున్నది. జాతీయంగా సాంస్కృతికంగా భాషా విషయికంగా ఆంధ్రులంతా ఒకటే అన్న ఆలోచన అంతటా అతిశయించింది. గత చరిత్ర తవ్వి ఆంధ్ర ప్రతిష్ఠను పునఃప్రతిష్ఠితం చేసే ప్రయత్నంలో ఆంధ్ర సాహిత్యాన్ని ఆదరించడం, ఆరాధించడం జరిగింది.

1926 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అవతరించిన నాటి పరిస్థితి ఇది. అప్పటి మద్రాసు శాసన సభాధ్యక్షులు శ్రీ సత్యమూర్తి గారి మాటల్లో చెప్పాలంటే, ఈ విశ్వవిద్యాలయం కాలక్రమేణ నిజమైన ఆంధ్రజాతీయ విశ్వవిద్యాలయం కావాలని ఆకాంక్షించబడింది. "తేజస్వినావధీతమస్తు" అన్న వాక్యం మన లక్ష్యం.

చతుష్షష్టి కళలకు సంకేతమైన పద్మం మన సంకేతం. ఆంధ్ర సంస్కృతిని అన్నివిధాలా వికసింప జేయాలన్నదే ఈ విశ్వవిద్యాలయ నిర్మాతల ఆదర్శం; అదేవారి లక్ష్యం.

ఈ విశ్వవిద్యాలయంలో మొట్టమొదట ఏర్పాటు చెయ్యబడ్డ శాఖలు—చరిత్ర, తెలుగు—కావడంలో విచిత్రమేమీలేదు. మొట్ట మొదటి ఉపాధ్యక్షులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు తెలుగులో విద్వత్కవులు, విమర్శకులు. గతానికి అతుక్కొని పోకుండానే, గత సంస్కృతిని పరిశీలించి పరిరక్షించాలనే సంకల్పమూ, పరిశోధనాదృష్టి తెలుగు సాహిత్యరంగంలో ప్రవేశపెట్టిందికూడా ఆయనే.

కాని ఈ కర్తవ్య నిర్వహణలో యూనివర్సిటీకి కావలసినంత ధనబలం లేదు, అయినా, పరిశోధనా వ్యాసంగాన్ని ప్రోత్సహించడానికి ఉదారంగా జమీందార్లు ముందుకు వచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తొలి ప్రో-ఛాన్సలర్ అయిన శ్రీ బొబ్బిలి మహారాజా వారు తెలుగు సంస్కృతాల అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ సహాయంవల్లనే అపురూపంగా దొరికే ఆంధ్ర సాహిత్య గ్రంథాల ప్రచురణకూడా ప్రారంభమైంది.

అంతవరకూ వ్రాత ప్రతుల్లో మాత్రమే నిలిచివున్న తెలుగు సాహిత్యంలోని ఉత్తమ గ్రంథాలను సేకరించి ప్రచురించాలని విశ్వవిద్యాలయంవారు ప్రయత్నించారు; తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలోని అప్పటికి అచ్చుపడని వ్రాతప్రతులన్నింటినీ పండితులను పంపి వ్రాయించి తెప్పించారు. అవన్నీ యూనివర్సిటీ లైబ్రరీలో భద్రపరచివుంచారు; తంజావూరు లైబ్రరీలో వున్న తెలుగు లిఖిత గ్రంథాల వివరణలతో కూడిన పట్టికను ప్రచురించారు. ఇంతేకాక, అనేక తాళపత్ర గ్రంథాలను సంపాదించి, అవి నశించిపోకుండా సంరక్షించారు; ఆంధ్ర శాఖాచార్యుడు ప్రధాన సంపాదకుడుగా ఒక ప్రత్యేక ప్రచురణ విభాగాన్ని నెలకొల్పారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి తొలి ప్రచురణ 'రంగనాథ రామాయణము' (1942). డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారి ప్రోత్సాహంతో ఈ గ్రంథ కర్తృత్వాన్ని గురించి శ్రీ పింగళి లక్ష్మీకాంతం కావించిన

పరిశోధన తెలుగు సాహిత్య చరిత్రలో సదృశాంశ పరిశీలనకు మార్గ దర్శకమైంది. ఆ తర్వాత 1943లో 'ద్విపద భారతము' నాలుగు సంపుటాలుగా వెలువడింది. మన విశ్వవిద్యాలయం వారు ఈ ప్రతి రాయించి తెప్పించుకోక ముందు, దీని ప్రాతప్రతి ఒకే ఒకటి తంజావూరు లైబ్రరీలో వుండేది. ఆ తర్వాత తంజావూరు యుగం నాటి దేశికవితా రూపకాలైన యక్షగానాల ప్రచురణ ఆరంభమైంది. ఇంతవరకూ పది సంపుటాలు వెలువడ్డాయి. ఇంకా ఐదు అచ్చులో వున్నాయి.

శ్రీ రామలింగారెడ్డిగారి 'కవిత్వ తత్త్వ విచారము' (1947), 'వ్యాస మంజరి' (1947), 'పంచమి' (1954) అనే ఆయన వ్యాస సంపుటాలూ ప్రచురించి ఆంధ్ర సాహిత్య విమర్శ రంగంలో మన విశ్వవిద్యాలయం ఒక సరికొత్త ఆలోచనాధారను పురికొల్పి. చరిత్రను సృష్టించింది; శాస్త్రీయమైన సంప్రదాయాన్ని నెల కొల్పింది.

తెలుగులో శ్రద్ధాసక్తులతో అనేక రంగాలలో విస్తృతమైన పరిశోధన జరిగింది. డాక్టర్ కె.వి.ఆర్. నరసింహంగారు 'ఆంధ్ర ప్రబంధము - అవతరణ వికాసములు' గూర్చి సమర్పించిన పిఎచ్.డి. సిద్ధాంత వ్యాసాన్ని ఈ విశ్వవిద్యాలయం ప్రచురించింది. డాక్టర్ ఎస్.వి. జోగారావుగారి 'యక్షగానముల చరిత్ర' (1961) కూడా ప్రచురితమైంది. ఇంకా ఎన్నో సిద్ధాంత వ్యాసాలు ప్రచురణ కోసం ప్రతీక్షిస్తున్నాయి.

తులనాత్మక భాషా శాస్త్రంలోకూడా గణనీయమైన పరిశ్రమ జరిగింది. ఈ రంగంలో బిషప్ రాబర్ట్ కాల్డ్వెల్ చేసిన పరిశ్రమ భాషా పరిశోధకులకు కొత్తద్వారాలు తెరిచింది. తెలుగు ద్రావిడ భాష అవునా కాదా అన్న విషయంలో తీవ్రమైన వాదోపవాదాలు చెలరేగాయి. తెలుగుయొక్క సంస్కృత జన్యతను స్థాపిస్తూ, డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు 'ఆంధ్ర భాషా చరిత్ర (1933) రచించారు. దాన్ని రెండు సంపుటాలుగా విశ్వవిద్యాలయం ప్రచురించింది. అందులోని సిద్ధాంతాలు ఏవీ ఇప్పటికి నిలబడక పోయినప్పటికీ, అందులో వివరించిన అనేక విషయాలను బట్టీ, గ్రంథకర్త పాండితీ విశేషాన్నిబట్టీ అది ఈనాటికీ భాషా శాస్త్ర విద్యార్థులకు పెన్నిధిగానేవుంది. ఆ తర్వాత కాల్డ్వెల్ ద్రావిడ భాషా కుటుంబాల తులనాత్మక వ్యాకరణం ఆదర్శంగా

ఆచార్య గంటి జోగి సోమయాజులుగారు 1947లో 'ఆంధ్ర భాషా వికాసము' రచించారు. అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రో-ఛాన్సలర్‌గా వున్న జయపూర్ మహారాజా శ్రీ విక్రమదేవ వర్మగారు ఆ గ్రంథ ప్రచురణకు ప్రత్యేకంగా విరాళం ఇచ్చి ప్రోత్సహించారు. ఆ తర్వాత తులనాత్మక భాషా శాస్త్రంలో శ్రీ వజ్ఝుల చిన సీతారామస్వామి శాస్త్రిగారి 'ద్రావిడ భాషా పరిశీలనము' (1955) రెండు సంపుటాలుగా వెలువడింది.

పరవస్తు చిన్నయసూరి రచించిన 'బాల వ్యాకరణము' మీద, అనేక గ్రాంథికాంధ్ర వ్యాకరణాలమీద తెలుగు శాఖవారు ప్రతిభాపూర్వకమైన పరిశోధన సాగించారు. కళాప్రపూర్ణ శ్రీ వజ్ఝుల చినసీతారామస్వామిశాస్త్రిగారి 'వైయాకరణ పారిజాతము' (1937), 'ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము' (1951) విశ్వవిద్యాలయం పక్షాన వెలువడ్డాయి. కళాప్రపూర్ణ శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రిగారి 'రమణీయము' అనే బాలవ్యాకరణ వ్యాఖ్య, మొదట్లో గ్రంథకర్తే ప్రచురించుకున్నా, ఇప్పుడు విశ్వవిద్యాలయం వారు పునర్ముద్రించడం జరిగింది. ఈ సందర్భంలో శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి 'ఆంధ్ర భాషానుశాసనము' అనే తెలుగు వ్యాకరణం పేర్కొనదగింది. విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఒకరైన శ్రీ శాస్త్రిగారు, గ్రాంథికభాష ఒక్కటే వ్యాకరణ యోగ్యమైనదని వ్యాకర్తలు హఠంపట్టిన రోజుల్లో కొన్ని వ్యావహారిక రూపాలకు సైతం గతి కల్పించడానికి ఈ వ్యాకరణంలో ప్రయత్నించారు.

ప్రాంతీయభాషలలో విద్యాబోధన ప్రారంభంకావడానికి చాలా కాలం పూర్వమే తెలుగులో వివిధ శాస్త్ర గ్రంథాలను విరచింపజేసి వెలువరించిన ప్రతిష్ఠ ఆంధ్ర విశ్వవిద్యాలయానికే చెందుతుంది. ఖగోళశాస్త్రంమీద శ్రీ కాళీపట్నం కొండయ్యగారి 'విశ్వరూపం' (1936), జీవశాస్త్రంమీద శ్రీ ఆర్. వి. శేషయ్యగారి 'జంతు శాస్త్రము' (1945), ట్రిగ్నోమెట్రీమీద శ్రీ కె. రంగాచారిగారి 'త్రికోణమితి' (1947), శ్రీ ఎ. బాలంకేశ్వరరావుగారి 'సాంకేతిక పదాల తెలుగు పర్యాయాలు' (1947), శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులుగారి 'భారత రాజ్యాంగ చరిత్ర' (1949), శ్రీ కొడవంటి నరసింహంగారి 'ఎక్కడనుంచి ఎక్కడకు', శ్రీ కంచి శేషగిరిరావుగారి 'మానవ వంశావళి', శ్రీ సిద్ధాంతి మల్లికార్జునంగారి

'ఎవరెస్టు శిఖరారోహణము' ఇత్యాదులు ఈ విశ్వవిద్యాలయం ప్రచురణలు.

ఇంతేకాక, ప్రామాణిక గ్రంథాల అనువాదాన్ని కూడా ఈ విశ్వవిద్యాలయం ప్రోత్సహించింది. Descartes రచించిన *Discourses de la Methode* అనే గ్రంథానికి ఆచార్య కె. సచ్చిదానందమూర్తి, ఆచార్య కె.వి.ఆర్. నరసింహంగార్లు 'ప్రామాణిక పద్ధతిపై ప్రసంగము' (1959) అన్న అనువాదాన్ని ప్రచురించిరి.

పోస్ట్-గ్రాడ్యుయేట్ విద్యాబోధన ఫలితంగా తెలుగులో వాఙ్మయచరిత్ర, సాహిత్య విమర్శ, భాషాపరిశీలనం, భాషాశాస్త్రం ప్రాచుర్యం వహించాయి. ఈ తరగతులు ప్రారంభించక పూర్వం పై విషయాల్లో పెద్ద పరిశ్రమ జరిగినట్టు లేదు. ఆయా విషయాలపై ఈ తెలుగుశాఖవారి కృషి అనల్పమైనది. సాహిత్య విమర్శలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి 'సాహిత్య శిల్ప సమీక్ష', ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారి 'సాహిత్య దర్శనము', 'దక్షిణాంధ్ర వాఙ్మయ చరిత్ర', ఆచార్య తూమాటి దొణప్పగారి 'ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము' (1969) అన్నవి సాహిత్య చరిత్ర విమర్శల ఈనాటి ఉన్నతస్థాయికి దోహదం చేశాయి. తెలుగు సాహిత్య చరిత్రలో దాదాపు అజ్ఞాతంగా వుండి పోయిన ఒక యుగాన్ని పూర్తిగా వెలుగులోకి తెచ్చిన ఉద్గ్రంథం 'ఆంధ్ర సంస్థానములు – సాహిత్య పోషణము'. అదే విధంగా తెలుగు శాఖలో పనిచేసిన ఆచార్య గంటి జోగిసోమయాజులు, డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తిగార్లు ద్రావిడ భాషా శాస్త్రంలోనూ, సామాన్య భాషాశాస్త్రంలోనూ ఎంతో అభివృద్ధి సాధించారు.

వీటికితోడు ఎక్స్టెన్షన్ లెక్చర్లు ఏర్పాటుచేసి, యూనివర్సిటీ, దేశంలోని మహా విద్వాంసుల్ని రావించి, వారిచేత ఉపన్యాసాలు ఇప్పించింది; శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి 'వేమన' ఉపన్యాసాలు (1936) గ్రంథ రూపంలోకూడా ప్రచురించింది.

ఉత్తమ నవలలకు బహుమతులిచ్చి, ఈ విశ్వవిద్యాలయం సృజనాత్మక సాహిత్యాన్ని ప్రోత్సహించింది. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయి పడగలు', శ్రీ అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' పేరొందగ్గవి. ప్రత్యేక పథకం కింద నిర్వహించ

బడ్డ నవలల పోటీలో నెగ్గి కుమారి మల్లాది వసుంధరగారి 'తంజా వూరు పతనము', 'సప్తపర్ణి', శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తిగారి 'భువన విజయము', 'గృహరాజు మేడ', శ్రీబొడ్డుపల్లి పురుషోత్తము గారి 'మహోదయము', శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారి 'చిత్ర శాల', శ్రీ పాటిబండ మాధవశర్మగారి 'రాజశిల్పి' ఆంధ్ర విశ్వ విద్యాలయంచే బహూకృతాలై, ప్రచురితాలైన రచనల్లో కొన్ని.

తెలుగు భాషకు 'వ్యుత్పత్తి పదకోశం' ఆవశ్యకమని – దాక్షిణాత్య భాషల్లో ఏ వ్యుత్పత్తి పదకోశమూ లేని ఈ శతాబ్ది ఆరవ దశకంలోనే-గుర్తించి, ఈ విశ్వవిద్యాలయం ఆ మహత్తర కార్య క్రమం చేపట్టింది. దేశీయ పదజాలం, సంస్కృత ప్రాకృతాలనించీ ఆధునిక భారతీయార్య ఐరోపీయ భాషలనించీ వచ్చిన వైకృత పదజాలం దీనికి వస్తువు. ప్రతి ఆరోపానికీ కాలక్రమంలో అర్థ వివరణ, ప్రయోగసూచి, సజాతీయభాషా పద ప్రదర్శనం, మూల ద్రావిడ రూపకల్పన–ఇందులో విశిష్టత. ఈ పదకోశంలో దాదాపు ముప్పైవేల ఆరోపాలు వుండవచ్చునని అంచనా. రెండవ ప్రణాళికా కాలంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌వారి ఆమోదంతో ఈ పని ప్రారంభమయింది. కొన్ని ఇబ్బందులవల్ల మూడో ప్రణాళికా కాలంలో ఆగినప్పటికీ, మళ్లీ నాలుగో ప్రణాళిక ప్రారంభించబడింది. ఇప్పుడు మొదటి సంపుటం అచ్చులో వుంది. తక్కినవి 1978 నాటికి తయారవుతాయి.

తెలుగు భాషా సాహిత్యాలలో పరిశోధనకూ ప్రచురణకూ దోహదంచేసి ప్రోత్సహించడమే కాక, మహా పండితులను ఉత్తమ కళాకారులను 'కళాప్రపూర్ణ' గౌరవ పట్టంతో సత్కరించే సత్సంప్రదాయంకూడా ఈ విశ్వవిద్యాలయం నెలకొల్పింది. శ్రీ యుతులు వేదం వేంకట రాయశాస్త్రి, తాతా సుబ్బరాయశాస్త్రి, గిడుగు వేంకట రామమూర్తి పంతులు, జయంతి రామయ్య పంతులు, చెల్లపిల్ల వేంకట శాస్త్రి, చిలుకూరి నారాయణరావు, వజ్ఝల చినసీతారామ స్వామి శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహద్దరు, వుయ్యూరు రాజా శ్రీ వెంకటాద్రి అప్పా రావు బహద్దరు, గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి, అబ్బూరి రామకృష్ణరావు, త్రిపురాన వెంకట సూర్యప్రసాదరాయ కవి, విశ్వనాథ సత్యనారాయణ, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, కొండ వీటి వెంకట కవి, పెనుమెత్స సత్యనారాయణ రాజు, కొండూరు వీర

రాఘవాచార్యులు, బోయి భీమన్న, కొత్త సత్యనారాయణ చౌదరి, సురగాలి తిమోతి జ్ఞానానందం, పురిపండా అప్పలస్వామి, ద్వారం వెంకటస్వామి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభృతులు 'కళా ప్రపూర్ణ' బిరుదంతో సత్కరించబడ్డారు.

తెలుగు భాషలో మరొక ప్రధానాంశంపై గూడా ఈ విశ్వ విద్యాలయం ఈనాడు కృషి చేస్తున్నది. గ్రాంథికమనీ, వ్యావహారిక మనీ తెలుగులో రెండు శైలీ భేదాలు కన్పిస్తాయి. వ్యవహార దూరమైన గ్రాంథిక భాషకే ఇంతవరకూ విశ్వవిద్యాలయాల్లో ప్రాసం వుండేది. సజీవమైన వ్యావహారిక భాషా ప్రతిభను వ్యాకరణ శృంఖలాలు అరికట్టకూడదనీ, భాష నవనవోన్మేషం చెందాలనీ శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ఒక ఉద్యమం లేవనెత్తారు. తత్ఫలితంగా అనేక తర్కవితర్కాలు జరిగి, 1914 లో మద్రాసు విశ్వవిద్యాలయం గ్రాంథిక భాషకే పట్టం కట్టింది. కాని దేశంలోని సాహిత్యమంతా సజీవ భాషలోనే వెలువడసాగింది. పత్రికా రచన, రేడియో రచన వివిధ ప్రక్రియల్లో సాహిత్య రచన అంతా వ్యావ హారికంలోనే జరిగింది, కేవలం పాఠ్య పుస్తకాల రచన మాత్రమే కృతక గ్రాంథికంలో కృతకంగా జరిగింది. ఈ పరిస్థితిలో విద్యార్థులు సమకాలిక భాషనించీ సమకాలిక సాహిత్యంనించీ దూరం చెయ్యబడి పొందవలసిన విజ్ఞాన వికాసాలను పొందలేక పోవడం గమనించి, ఈ విషయంపై పరిశీలనకు శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన ఒక భాషా సంఘాన్ని నియమించింది. ఈ సంఘంవారు సమర్పించిన నివేదికను ఆమోదించి, అకడమిక్ కౌన్సిల్ వ్యావహారిక భాషకు విశ్వవిద్యాలయంలో ప్రవేశం కల్పించింది. ఈ నివేదికలోని సిఫార్సులను అమలు పరచడంలో ఎదురయ్యే సమస్యలను శాస్త్రీయంగా అవగాహన చేసుకోడానికీ, సమర్థంగా పరిష్కరించడానికీ శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన ఒక స్థాయీ సంఘం ఏర్పడింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం త్వరలో స్వర్ణోత్సవం చేసుకో బోతున్నది. గడచిన అర్ధ శతాబ్దిలో ఎన్నో కష్ట సుఖాలు అనుభ వించింది. మొదట్లో ధనలోపంవల్లా, తర్వాత రెండో ప్రపంచ యుద్ధకాలంలో వచ్చిన అస్తవ్యస్త పరిస్థితులవల్లా కొంత వెనుకంజ వెయ్యవలసి వచ్చినా, స్వాతంత్ర్యానంతర కాలంలో ఎంతో పురోగ మించింది. పరిశోధనా వ్యాసంగానికి యు:జి.సి. సహాయం లభిం

చింది. తెలుగు సాహిత్యం అభివృద్ధిపట్ల క్రియాత్మకమైన అభిరుచి చూపిన ఉపాధ్యక్షులు లభించడం ఈ యూనివర్సిటీ అదృష్టం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వి.ఎస్. కృష్ణ, డాక్టర్ ఎ.ఎల్. నారాయణ, శ్రీ ఎల్. బుల్లయ్య గార్లు కవి పండిత పోషణలో వ్యవస్థాపక-ఉపాధ్యక్షులైన డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారి సంప్రదాయాన్నే పాటించారు.

ప్రస్తుత ఉపాధ్యక్షులు శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు తర తరాలుగా ఆంధ్ర సంస్కృతిని పోషించిన, భూషించిన ఉత్తమ సంస్థానాధిపతుల కుటుంబానికి చెందినవారు. వీరు కర్తా, కారయితా, కృతికర్తలూ, కృతిభర్తలూ. కళా సేవనంలో, కళా పోషణంలో పెద్ద పేరు గలవారు. సుమారు నాలుగు దశాబ్దాలు ఆంధ్ర విశ్వకళాపరిషత్తుతో సన్నిహిత సంబంధం కలవారు. వీరు ఈ ఉన్నత పీఠాన్ని అధిష్ఠించడం పరిషత్తుకు ఇతోధిక శుభ సూచకం.

ఇక తెలుగు శాఖలో తొలుదొల్త పనిచేసిన మహామహులు ఈ శాఖకు ఒక చిరంతనమైన ఆశయాన్నీ ఆదర్శాన్నీ ప్రసాదించారు. ఈ శాఖకు మొట్టమొదటి అధ్యక్షులైన శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారితో పాటు, ఆధునిక భావ కవితా నిర్మాతలలో ఒకరూ, ఉత్తమ పండితులూ, క్రాంతదర్శులూ అయిన శ్రీ అబ్బూరి రామకృష్ణారావు గారు కూడా ఇందుకు దర్శకత్వం వహించారు. వీరి 'ఊహాగానం-ఇతర కృతులు' వెలలేని, తులలేని కళాఖండాలు. ఆ తరువాత ఈ తెలుగు శాఖలో ఎందరో మహా పండితులు మేధావులు పని చేశారు. ఆంధ్ర సాహిత్యాన్ని గూర్చిన విశిష్ట విజ్ఞానాన్ని సాధించడం కోసం వీరంతా ఎంతో ఓర్పుతో నేర్పుతో పరిశ్రమించి, వైజ్ఞానిక ప్రగతికి బాటలు తీర్చారు.

ఆంధ్ర భాషా సాహిత్య చరిత్రల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అత్యంత ప్రముఖపాత్ర నిర్వహించిందనడంలో విప్రతిపత్తి లేదు. అది ఒక కొత్త దృక్పథాన్నీ, ఒక కొత్త పరిశోధనాపథాన్నీ, అంతకంటె ముఖ్యంగా వైజ్ఞానిక రంగంలో తెలుగునకు ఒక ఆత్మ ప్రత్యయాన్నీ నెలకొల్పింది. ఇది అసాధారణమైన అద్భుత విజయంగా చెప్పుకోవచ్చు.

9004

Blank Page

64